ఉక్కు కాంట్రాక్టు కార్మికుల

సమ్మె విజయవంతం

- ప్లాంట్‌లోని హెచ్‌ఒడి కార్యాలయాల వద్ద నిరసనలు

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 236 | విజయవాడ, శనివారం 29 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 29 March 2025 | Rs

17 ఏళ్ల తర్వాత చెపాక్‌లో బెంగళూరు గెలుపు

- పాటిదార్ కెప్టెన్ ఇన్నింగ్స్

8

మృత్యుకంపం

- భూ ప్రళయంతో మయన్మార్, థాయ్‌లాండ్ విలవిల
- 200 దాటిన మృతుల సంఖ్య
- మరణాలు భారీగా పెరిగే అవకాశం

రోదిస్తున్న మృతుల బంధువులు

బ్యాంకాక్‌లో కుప్పకూలిన బహుళ అంతస్తుల భవనం వద్ద సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

పృథ్వీ ప్రళయం 7

భారీ భూకంపం మయన్మార్, థాయ్‌లాండ్‌లలో పెను విలయం సృష్టించింది. శుక్రవారం మధ్యాహ్నం ప్రాంతంలో నిమిషాల వ్యవధిలో చోటుచేసుకున్న వరుస భూకంపాలు ఆ రెండు దేశాల్లో వందలాది ప్రాణాలను బలిగొన్నాయి. కుప్పకూలిన భవనాల శిథిలాల్లో చిక్కుకుని 200 మందికిపైగా మరణించినట్లు సమాచారం. అయితే రాత్రి 12:30 గంటల ప్రాంతంలో 150 మందికి పైగా మరణించినట్లు మయన్మార్ అధికారికంగా ప్రకటించింది. ఆకాశ హర్మ్యాలు కుప్ప కూలడంతో ఎంతమంది ఆ శిథిలాల కింద చిక్కుకున్నారో అర్థం కాని స్థితి. దీంతో రెండు దేశాల్లోనూ మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. రోడ్లమీద తిరుగుతున్న ప్రజల కళ్ల ముందే నిమిషాల వ్యవధిలో పెద్ద పెద్ద భవంతులు కుప్పకూలాయి. భూకంప ధాటికి బహుళ అంతస్తుల భవనాల పైన ఉండే స్విమ్మింగ్‌పూల్స్‌లోని నీళ్లు ఎవరో ఎత్తిపోసినట్లు ఒక్కసారిగా కిందకు పడ్డాయి. రెప్పపాటు కాలంలోనే అంతపెద్ద భవనాల స్థానంలో శిథిల దృశ్యాలు ప్రత్యక్షమయ్యాయి. వంతెనలు కూలిపోయాయి. రోడ్లు కదిలి బీటలు వారాయి. ఏం జరుగుతుందో అర్థంకాని ప్రజల రోదనలు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతాలు మార్మోగాయి. రిక్టర్ స్కేల్‌పై భూ కంప తీవ్రత 7.7గా నమోదైంది. 2004 తరువాత మయన్మార్‌లోనూ, 2023 తరువాత ప్రపంచవ్యాప్తంగానూ చోటుచేసుకున్న అతి పెద్ద భూకంపం ఇది! భారతదేశం, చైనా, బంగ్లాదేశ్, ఇండోనేషియా, కాంబోడియా, వియత్నాంలలోని కొన్ని ప్రాంతాల్లోనూ భూ కంప ప్రభావం కనిపించింది. ఈ సంఘటన పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పోప్ ఫ్రాన్సిస్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. మృతులకు సంతాపాన్ని తెలిపారు. బాధితులను ఆదుకోవడానికి సహకరించాలని మయన్మార్, థాయ్‌లాండ్‌ల ప్రభుత్వాలతో పాటు ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చింది.

రబీలోనూ కరువుకు కోతలే

- మూడు నెలలుగా చినుకు లేదు
- 500 పైన మండలాల్లో తీవ్ర వర్షాభావం, డ్రైస్పెల్స్
- డ్రాట్ 51 మండలాలకు కుదింపు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రబీలోనూ కరువు మండలాలు ప్రకటించే విషయంలో కూటమి ప్రభుత్వం కోతలకు దిగింది. రాష్ట్రంలో మొత్తం 679 మండలాలుండగా 500 కు పైన మండలాల్లో వర్షాభావం తిష్ట వేసింది. రెండు మూడు నెలల నుంచి చినుకు జాడ లేదు. లక్షల ఎకరాల్లో రబీ పంటల సాగు తగ్గింది. సాగు చేసిన లక్షలాది ఎకరాల్లోని పంటలు ఎదుగుదల లేక దిగుబడి నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల పూర్తిగా చేతికి రాకుండా ఎండిపోయాయి. సీజన్ చివరి దాకా మీనమేషాలు లెక్కించిన ప్రభుత్వం, మార్చి నెలాఖరుకల్లా కేంద్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం కరువు మండలాలను ప్రకటించాల్సి ఉన్నందున, 51 మండలాలను ప్రకటించే ందుకు సర్కారు సిద్ధమైందని తెలుస్తోంది. ఉత్తర్వులు రావాల్సి ఉంది. జిఓ వచ్చే వరకు వేచి చూడాలని, రేపో మాపో జిఓ వెలువడుతుందని, కరువు మండలాల సంఖ్య ఇంకా పెరగనూవచ్చు లేదంటే తగ్గనూ వచ్చని స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్టుమెంట్ వర్గాలు వెల్లడించాయి.

ఖరీఫ్ దారిలో...

ఖరీఫ్‌లో జులై, ఆగస్టు మాసాల్లో తీవ్ర వర్షాభావం, డ్రైస్పెల్ (వర్షానికి వర్షానికి మధ్య వ్యవధి) నెలకొన్నాయి. సీజన్ ఆఖరు సెప్టెంబర్ 30 నాటికి (నైరుతి రుతుపవన కాలం) 466 మండలాల్లో డ్రైస్పెల్ ఉంది. 350 పైన మండలాల్లో వర్షాభావం నెలకొంది. చివరి నిమిషంలో అక్టోబర్ ఆఖరులో 54 కరువు మండలాలను అతికష్టం మీద ప్రభుత్వం ప్రకటించి చేతులు దులుపుకుంది. అది కూడా 27 మండలాలు తీవ్రస్థాయి, మరో 27 మండలాలు మధ్యస్త స్థాయి కరువుగా వర్గీకరించింది. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు, రైతు సంఘాల నుంచి నిరసన వ్యక్తమైంది. మరిన్ని మండలాలను ప్రకటించాలని ఆందోళనలు కూడా చేశారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. రబీలోనూ ప్రభుత్వం అదే బాణీ అవలంబిస్తోంది. రబీ (ఈశాన్య కాలం)లో 541 మండలాల్లో డ్రైస్పెల్ ఉంది. ఖరీఫ్‌లో తిష్ట వేసిన కరువు రబీలోనూ కొనసాగింది. అక్టోబర్‌లో 284 మండలాల్లో వర్షాభావం ఉంది. అదే నెలలో 347 మండలాల్లో డ్రైస్పెల్ ఉంది. నవంబర్‌లో ఏకంగా 446 మండలాల్లో అత్యల్పవర్షం నమోదుకాగా 536 మండలాల్లో డ్రైస్పెల్ నెలకొంది. డిసెంబర్‌లో

మిగతా 7లో

ఏప్రిల్ నుంచి రబీ ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏప్రిల్ నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఎపి పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్ 227వ బోర్డు సమావేశం విజయవాడ కానూరులోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో మంత్రి నాదెండ్ల అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో 5,61,216 మంది రైతుల నుంచి 35,48,724 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రూ.8,138 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, రవాణా, భద్రత, నిర్వహణను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ప్రైవేట్ గోడౌన్ల వద్ద ఎఐ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి గోడౌన్ పైభాగంలో సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసి, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహిస్తామన్నారు.

విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా హాస్టళ్లకు లక్షా 14 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో చౌక ధరల దుకాణాల ద్వారా రాగి, కొర్రలు, సజ్జలు అందిస్తామన్నారు. దీపం-2 పథకం కింద 98 లక్షల మంది లబ్ధిదారులు మొదటి సిలిండర్ పొందారన్నారు.

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

- ఎఐ, డీప్ టెక్నాలజీ కేంద్రంగా ఎపి
- చెన్నై సెమినార్లో చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐఐటి మద్రాస్ సహకారంతో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. చెన్నైలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మద్రాస్‌లో శుక్రవారం జరిగిన ఆలిండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఎఐ, డీప్ టెక్నాలజీకి కేంద్ర బిందువుగా మార్చనున్నట్లు చెప్పారు. దేశంలో 65 శాతం మంది ఎఐని వాడుతున్నారని, ఇది ప్రపంచ సగటు 30 శాతం కన్నా అధికమని తెలిపారు. ఎఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త సాంకేతికతలో విద్యార్థులు ముందుండాలని సూచించారు. మద్రాస్ ఐఐటి చాలా విషయాల్లో మొదటిస్థానంలో ఉందని, వివిధ రకాల ఆన్‌లైన్ కోర్సులు కూడా అందిస్తోందని పేర్కొన్నారు. నూతన పరిశోధనలు దేశాన్ని అంతరిక్షం, సెమీ కండక్టర్ల రంగాల్లో ముందుండేలా చేస్తున్నాయని వివరించారు. ఇక్కడి స్టార్టప్‌లు దాదాపు 80 శాతం సక్సెస్ అయ్యాయని వివరించారు. 1995లో బిల్‌గేట్స్‌తో మాట్లాడి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ స్థాపించాలని కోరానని, ఇప్పుడు సిఇఓగా సత్య నాదెళ్ల ఉన్నారని అన్నారు. 2014లో దేశం పదో ఆర్థిక వ్యవస్థగా ఉంటే ఇప్పుడు ఐదోస్థానానికి ఎదబాకిందని పేర్కొన్నారు. అందరూ కలిసి కృషిచేస్తే ప్రపంచంలో మొదటి స్థానానికి చేరుకుంటామని పేర్కొన్నారు. అమెరికాలో ఎక్కువ తలసరి ఆదాయం తెలుగువారి దేనని, అక్కడి ధనిక ప్రాంతాల్లో తెలుగు, తమిళులే ఎక్కువ ఉంది ఉంటారని వివరించారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో తెలుగువారు ముందుం టారని, సిలికాన్ వ్యాలీ, నాసా, వాల్‌స్ట్రీట్‌లో భారతీ యులు ఆధిపత్యాన్ని సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఎనర్జీ రంగంలో ఎపి ముందుందని వివరించారు. భవిష్యత్‌లో రెండు రూపాయలకే యూనిట్ విద్యుత్ ఉత్పత్తి చేస్తామని వివరించారు. ఎపిని ఇన్నోవేషన్‌కు కేంద్రంగా మారుస్తామని చెప్పారు. ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి మాట్లాడుతూ సైబరా బాద్ అభివృద్ధిలో చంద్రబాబు మార్గదర్శకుడని అన్నారు.

చంద్రబాబుకు ఎఐ, డీప్ టెక్నాలజీ గురించి వివరిస్తున్న రీసెర్చ్ స్కాలర్స్

కునాల్ కమ్రాకు మధ్యంతర బెయిల్

చెన్నై : ప్రముఖ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాకు మద్రాస్ హైకోర్టు శుక్రవారం మధ్యంతర బెయిల్ జారీ చేసింది. అంతర్-రాష్ట్ర ముందస్తు బెయిల్ కోరుతూ మద్రాస్ హైకోర్టును కమ్రా ఆశ్రయించారు. జస్టిస్ సుందర్ మోహన్ ధర్మాసనం ఎదుట అత్యవసర విచారణ కోరుతూ కమ్రా తరపున న్యాయవాది వి సురేష్ గురువారం రాత్రి ఇ-ఫైలింగ్ ద్వారా ఈ పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ చేపట్టిన కోర్టు ఏప్రిల్ 7వరకు మధ్యంతర ముందస్తు బెయిల్ జారీ చేసింది. ఈ కేసు రాజకీయ ప్రేరేపితమని, భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డుకునే యత్నమని ఆయన పేర్కొన్నారు. తాను నిర్దోషినని, ఒక కళాకారుడిని వేధించడం, అడ్డుకోవడం లక్ష్యంగా పనికిరాని ఫిర్యాదుతో కేసులో ఇరికించారని కమ్రా పిటిషన్‌లో పేర్కొన్నారు. తన భద్రత, రానున్న ప్రభుత్వ సెలవుల ఆందోళనల దృష్ట్యా అంతర్‌రాష్ట్ర ముందస్తు బెయిల్ కోరుతున్నట్లు తెలిపారు. ముంబయిలో పుట్టిపెరిగినప్పటికీ భద్రత కోసం 2021లో తన నివాసాన్ని తమిళనాడు విల్లుపురానికి మార్చుకున్నట్లు తెలిపారు. 'నయాభారత్ ' అనే తన తాజా షోలో ఎవరినీ ముఖ్యంగా మహారాష్ట్ర డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండే పేరును పేర్కొనలేదని కోర్టుకు తెలిపారు. ఇప్పటికీ తనకు బెదిరింపులు వస్తున్నాయన్నారు.

సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్లపై జనాగ్రహం

- రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు
- విద్యుత్ బిల్లుల దహనం
- విద్యుత్ సంస్కరణలను రద్దు చేయాలి : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- యంత్రాంగం

విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్: ఛార్జీలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్ సబ్‌స్టేషన్లు, గ్రామ, వార్డు, సచివాలయాల ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ద్వారా అదనపు బిల్లులు వేసే ప్రమాదకరమైన విధానాన్ని తీసుకొస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ చట్టానికి సవరణలు చేసి విద్యుత్ రంగాన్ని అదాని, మరికొంత మంది కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమూ కార్పొరేట్లకు పూర్తిగా లొంగిపోయిందన్నారు. భవిష్యత్తులో విద్యుత్ రంగం పూర్తిగా కార్పొరేట్ల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోనుందని, దీనివల్ల విద్యుత్ ఛార్జీలు మరింతగా భారమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రమాదకరమైన విద్యుత్ సంస్కరణలను రద్దు చేయాలని, విద్యుత్ రంగం ప్రయివేటీకరణను ఆపాలని, విద్యుత్ చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదకర విధానాలపై ప్రజలందరూ ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరామ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని విద్యుత్ భవన్ వద్ద ధర్నా చేశారు. సెకీ ఒప్పందం రద్దు చేయాలని నినదించారు. కర్నూలులోని విద్యుత్ సౌధ వద్ద ధర్నాలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రూ అప్ సర్దుబాటు పేరుతో వేస్తున్న భారాలను ఆపకపోతే మరో విద్యుత్ పోరాటాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలపై భారాలు మోపిన, అవినీతికరమైన సెకీ ఒప్పందాన్ని కొనసాగించడం శోచనీయమన్నారు. ఆదోని, కౌతాళం, హాలహర్వి, పత్తికొండలలో నిరసన తెలిపారు. నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్‌లో ధర్నా చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో విద్యుత్ భవన్ వద్ద నిరసన తెలిపారు. అనంతపురంలో తహశీల్దార్ కార్యాలయం

మిగతా 7లో

కర్నూలులో విద్యుత్ సౌధ ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

డిఎ 2% పెంపు

కేంద్ర కేబినెట్ ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్ (కరవు భత్యం), పింఛన్‌దారులకు డియర్‌నెస్ రిలీఫ్ (డిఆర్)ను రెండు శాతం చొప్పున పెంపుదల చేస్తూ కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ కుమార్ వైష్ణవ్ మాట్లాడుతూ తాజా నిర్ణయంతో జవనరి 1 నుంచి చెల్లించాల్సిన డిఎ రేటు 55 శాతానికి పెరుగుతుం దన్నారు. ఇందుకోసం ప్రతి సంవత్సరం రూ.6,614.04 కోట్లు వెచ్చించాల్సివుంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 48.66 లక్షల మంది ఉద్యోగులకు, 66.55 లక్షల మంది పింఛనుదారులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఏడో వేతన సంఘం ఆమోదించిన సూత్రానికి అనుగుణంగా ఈ పెంపు నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు.

పోషకాధారిత ఎరువులకు రాయితీ

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పోషకాధారిత పిఅండ్‌కె ఎరువులకు సబ్సిడీ మంజూరు చేస్తూ కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. రూ.37,216 కోట్లు మంజూరు చేయనుంది. న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ పథకం కింద 28 రకాల పోషక ఆధారిత ఎరువుల గరిష్ట చిల్లర ధరను తయారీదారులు, దిగుమతిదారులు తగినంత స్థాయిలో నిర్ణయించేందుకు అనుమతి ఇచ్చింది. 2025 ఖరీఫ్ సీజన్‌లో (2025 ఏప్రిల్ 1 నుండి 2025 సెప్టెంబర్ 30 వరకు) ఫాస్ఫరస్ అండ్ పొటాషియం (పిఅండ్‌కె) ఎరువులపై సబ్సిడీ (ఎన్‌బిఎస్) రేట్లను మంత్రివర్గం ఆమోదించింది.

- ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ల తయారీ పథకానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ రంగంలో దేశ, విదేశీ సంస్థల నుంచి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించినట్లు కేంద్రం పేర్కొంది. రూ.59,350 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి రూ.4,56,500 కోట్ల విలువైన కాంపోనెంట్ల ఉత్పత్తికి అవకాశం ఉంటుందని పేర్కొంది. దాదాపు 91,600 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించే వీలుందని కేంద్రం తెలిపింది.
- బీహార్‌లో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్‌ఎఎం)లో 4-లేన్ గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ పాట్నా-అర్రా-ససారాం కారిడార్ (ఎన్‌హెచ్-119ఎ) (120.10 కిలో మీటర్ల) నిర్మాణానికి కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

అమలాపురంలో అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలోని బృందం

విజయవాడ కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

శివారు భూములకు సాగు నీరందించాలి

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శివారు ప్రాంత భూములకు సాగునీరు అందడంలేదని, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సాగుకు నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 4వ రోజైన శుక్రవారం అమలాపురం రూరల్ మండలంలోని వన్నె చింతలపూడి, తాండవపల్లి, పర్యటించారు. సాగునీరు అందక ఎండిపోతున్న వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సాగునీటి సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తించాలని, జిల్లాలో ఎక్కడా కూడా పంటలు ఎండిపోకుండా చూడాలని కోరారు. సైకిల్ యాత్ర జరుగుతున్న ప్రాంతానికి ఇరిగేషన్ ఎస్ఇ గోపీనాథ్ చేరుకొని సిపిఎం నేతలతో మాట్లాడారు. ప్రస్తుతం వంతుల వారీ విధానంలో పంటలకు సాగునీరు అందిస్తున్నామని ఎస్ఇ తెలిపారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అమలాపురంలోని చంద్రబాబు కాలనీలో మహిళలు మాట్లాడుతూ తమ భూమిని కబ్జా చేశారంటూ సిపిఎం బృందం వద్ద వాపోయారు. కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన భూమికి నకిలీ పత్రాలు సృష్టించి భూస్వాములు కబ్జా చేశారని తెలిపారు. కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరుగలేదని వాపోయారు. అక్కడే ఉన్న అక్రమణదారుడు దేగల వీరబాబు సిపిఎం బృందంపైనా, మహిళలపైనా దాడికి యత్నించాడు. అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను వెంటనే ఆపాలని, లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించడంతో ఆక్రమణదారుడు అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మరోసారి నిర్మాణాలు మొదలుపెడితే తమ దృష్టికి తీసుకురావాలని మహిళలకు తెలిపారు. ఆక్రమణలపై పార్టీ పరంగా న్యాయస్థానంలో కూడా పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం టిడ్కో గృహాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శితోపాటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆండ్ర మాల్యాద్రి, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్లు, ఇళ్ల స్థలాలపై సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలి : సిపిఎం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా తరువాత కూడా పెద్ద సంఖ్యలో మహిళలు కలెక్టరేట్ వద్దకు చేరుకొని అర్జీలను అందజేశారు. అర్హులైన పేదలకు నగరంలోనే రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని, ఇళ్ల పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని, టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇళ్లను అప్పగించాలని, ఖాళీగా ఉన్న జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం గృహాలను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న ఉగాదినాడు పి4పై సిఎం చంద్రబాబు మాట్లాడే సమయంలో స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ధర్నా అనంతరం ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పట్టాల రిజిస్ట్రేషన్ కోసం పేదలు తీసుకొచ్చిన అర్జీలను సేకరించి సిపిఎం నేతలు బాబూరావు, కాశీనాథ్, శ్రీదేవి, ఇతర నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశకు అందజేశారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని 16 కిలోమీటర్లు గిరిజనుల పాదయాత్ర

అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం శంకరం పంచాయతీలోని గిరిజన గ్రామాలైన తాడివలస, గొప్పూరు, రాయిపాలెం, రాజంపేట, వెలగపాడు, కొత్తవలస, మామిడిపాలెం గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పించాలని, కొత్తవలస - తాడివలస గెడ్డలపై బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతూ గిరిజనులు కృష్ణంపాలెం గొప్పూరు నుంచి మాడుగుల మండల కేంద్రం వరకు 16 కిలోమీటర్లు మేర మండుటెండలో పాదయాత్ర నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని ధర్నా చేపట్టారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పాదయాత్రనుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మాట్లాడుతూ.. వర్షాకాలంలో గెడ్డలు దాటలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గర్భిణులు, బాలింతలను ఆస్పత్రులకు డోలీల్లో మోసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రహదారి సౌకర్యం కల్పిస్తే గిరిజనుల కష్టాలు తీరుతాయన్నారు. అల్లూరి జిల్లాలోని ముంచంగిపుట్టులో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. జడ్‌పి గెస్ట్ హౌస్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.

కొల్లేరు ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు జిల్లాలోని ఏలూరు రూరల్, మండవల్లి, కైకలూరు మండలాల్లో ప్రజా చైతన్య యాత్ర సాగింది. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ.. కొల్లేరు సరస్సును 5 నుండి 3వ కాంటూరుకు కుదించాలని, కాలుష్యం అరికట్టాలని కోరారు. నష్టపోయిన పేదలు, సొసైటీలు, డి.ఫారం పట్టాదారులకు కుటుంబానికి రెండెకరాల భూమి ఇవ్వాలని, రెగ్యులేటర్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు పరిధి పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే చర్యలు ఆపాలని కోరారు.

శిశుసంరక్షణ కమిటీల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో శిశుసంరక్షణ కమిటీల నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాలల సంక్షేమశాఖ సంచాలకులు ఎం వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఈ జిల్లాల్లో ఏర్పాటు చేయబోయే శిశుసంరక్షణ కమిటీల్లో ఛైర్‌పర్సన్లు, సభ్యులు, జువైనల్ జస్టిస్ బోర్డుల్లో సభ్యులుగా సేవలు అందించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను నిర్దేశిత నమూనాలో, వారి అర్హత ధ్రువీకరణ పత్రాల నకళ్లతోపాటు ఏప్రిల్ 9, 2025లోపు విజయవాడలోని బాలల సంక్షేమశాఖ సంచాలకుల కార్యాలయానికి పంపాలన్నారు. విద్యార్హతలు, అనుభవం, ఎంపిక విధానం, ఇతర వివరాలకు http://wdcw.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను స్పీడ్ పోస్ట్ లేక రిజిస్టర్ పోస్ట్‌లో మాత్రమే పంపాలని, ఇ-మెయిల్‌కు పంపిన దరఖాస్తులు, అసంపూర్తి దరఖాస్తులు అంగీకరించబడవని పేర్కొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఎపిఎంను తొలగించాలి

ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల జిల్లా, బనగానపల్లె మండలం, ఎపిఎం అడ్డకుల శ్రీనివాసులును విధుల్లోంచి తొలగించి, లైంగిక వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సెర్ప్ సిఇఒ వి కరుణను, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి విజయవాడలో శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఎపిఎం శ్రీనివాసులు తన పరిధిలో పనిచేస్తున్న మహిళా విఒఎలను లైంగిక వేధింపులకు గురిస్తున్నారని, ప్రతిరోజూ కార్యాలయానికి వచ్చి కనిపించాలనడం, వచ్చిన వెంటనే కరచాలనం చేయడం, ఇతర అసభ్యకరమైన వేధింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. మహిళా విఒఎ గ్రూపులో అశ్లీల చిత్రాలను పోస్ట్ చేస్తున్నారని, రాత్రి వేళల్లోనూ మహిళా విఒఎలను ఫోన్‌లో వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ వేధింపులను ప్రశ్నించిన తోటి విఒఎలైన సాయికుమార్, మధుశేఖర్, శివకుమార్, గౌసియాలను అక్రమంగా తొలగించారని చెప్పారు. మిగిలిన వారిని కూడా తొలగిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. గ్రామ సంఘాల అభిప్రాయం లేకుండా తొలగింపు చేయకూడదని, గ్రామైక్య సంఘం సర్వసభ్య సమావేశం జరపకుండా మండల సమాఖ్యలో తనకు అనుకూలంగా ఉన్న వారితో తీర్మానం చేసి తొలగింపులకు పాల్పడుతున్నట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన విఒఎలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఎపిఎంను విధుల్లోంచి తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ధనలక్ష్మి కోరారు.

నేడు టిడిపి ఆవిర్భావ సభకు చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి 43వ ఆవిర్భావ సభ టిడిపి కార్యాలయంలో శనివారం జరగనుంది. ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి హాజరై ఆ పార్టీ జెండాను ఆవిష్కరించనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస యాదవ్, పొలిట్‌బ్యూరో సభ్యులు తదితరులు హాజరుకానున్నారు.

47 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల నియామకం

రాష్ట్రంలో 47 వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీలకు టిడిపి ఛైర్మన్లు, సభ్యులను ప్రకటించింది. మొత్తం 705 మంది సభ్యులకు ఈ నామినేటెడ్ పోస్టుల ద్వారా అవకాశం కల్పించింది. ఛైర్మన్ పదవులను 37 టిడిపి, 8 జనసేన, 2 బిజెపి చొప్పున కేటాయించారు.

1న టెన్త్ సోషల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి విద్యార్థులకు సోషల్ స్టడీస్ పరీక్ష ఏప్రిల్ 1వ తేదీన జరుగుతుందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఈ నెల 31వ తేదిన రంజాన్ సందర్భంగా సెలవు దినంగా ప్రకటించినట్లు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

పరీక్ష తేదీని విద్యార్థులతో పాటు పరీక్ష విధుల్లో ఉన్న వారందరికీ తెలియజేయాలని ప్రాంతీయ, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 31వ తేదిన నిల్వ కేంద్రాల నుంచి ప్రశ్నపత్రాలు రహస్య మెటీరియల్‌ను తీసుకెళ్లకూడదని తెలిపారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికులకు గత సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు, ఉద్యోగ విరమణ వయసు 62కు పెంచడం, గ్రాట్యూటీ చెల్లింపునకు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిడిఎంఎ పి సంపత్ కుమార్‌ను యూనియన్ నాయకులు తాడేపల్లిలో శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందించి పలు అంశాలపై చర్చించారు. ఆప్కాస్‌లో ఉన్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం సాధ్యం కానందున ఉద్యోగ విరమణ వయోపరిమితి 62కు పెంపు, గ్రాట్యూటీ వర్తించవని ఇటీవల సిడిఎంఎ జారీ చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ఎక్స్‌గ్రేషియా రూ.7 లక్షలకు పెంచడం, ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంపు, డిఎ బకాయిలు, సరెండర్ లీవ్ వంటి అంశాలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేయాలని నాయకులు కోరారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో గత ఆరేళ్లుగా పని చేస్తున్న ఆప్కాస్ కార్మికులు 35 మందిని 12 రోజుల కిందట నిర్లక్ష్యంగా ఉద్యోగాల నుంచి తొలగించారని, గతంలో కూడా వీరితో నెల రోజులు పని చేయించుకుని రూ.21 వేలు చెల్లించకుండా కేవలం 10 నుంచి 12 రోజులు మస్టర్లు వేసి రూ.4 వేల నుంచి రూ.6 వేలు చెల్లించారని చెప్పారు. ఈ అక్రమ తొలగింపులను ఆపాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపాలిటీలో స్థానిక కమిషనర్ కక్ష సాధింపు చర్యలను నివారించాలని, డ్రైవర్ ఆంజనేయులు, తాగునీటి విభాగం కార్మికులు జుబేరాలకు తిరిగి విధులు అప్పగించాలని సిడిఎంఎ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిడిఎంఎ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. గత సమ్మె కాలపు ఒప్పందాలకు సంబంధించి మంత్రిని, ఉన్నతాధికారులను సంప్రదించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామని, ఇతర సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిడిఎంఎను కలిసిన వారిలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె విజయలక్ష్మి, పి శ్రీనివాసరావు, వి కుమారి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇన్సెంటివ్స్ పునరుద్ధరణ

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లేపాక్షి ఉద్యోగులకు గతంలో నిలిపేసిన ఇన్సెంటివ్స్ పునరుద్ధరిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేపాక్షి విక్రయశాల్లో ఉత్పత్తుల అమ్మకాలను పెంచేలా ఉద్యోగులకు ఇన్సెంటీవ్స్ ఇస్తుండటం ఆనవాయితీగా వస్తోందని, కరోనా పేరుతో గత ప్రభుత్వం వీటిని నిలిపివేసిందన్నారు. రాష్ట్రంతోపాటు దేశంలోని పలు నగరాల్లో 97 విక్రయశాలలు ఉన్నాయని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెల వరకూ ఉత్పత్తుల అమ్మకాలతో రూ.5.50 కోట్లు మేర లాభాలు ఆర్జించినట్లు మంత్రి తెలిపారు. ఈ మొత్తంలో ఉద్యోగులకు రూ.32.42 లక్షల మేర ఇన్సెంటివ్స్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. శాశ్వత ఉద్యోగులకు మూల వేతనంలో మూడింట రెండొంతులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.15 వేలు, రోజువారీ వేతనం తీసుకునే ఉద్యోగులకు రూ.4 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఐదేళ్ల అనంతరం ఇన్సెంటివ్స్ పునరుద్ధరించడంపై లేపాక్షి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను కలిసి ధన్యవాదాలు తెలిపారు. లేపాక్షి విక్రయ శాలల్లో అమ్మకాలు పెంచి, హస్తకళాకారులకు అండగా నిలవాలని ఈ సందర్భంగా ఉద్యోగులకు మంత్రి సూచించారు.

పదవులు దక్కించుకునేందుకు టిడిపి కూటమి కుయుక్తులు

- సభ్యుల అడ్డగింతలు, ప్రలోభాలకు తెర
- కోరం లేక పలుచోట్ల ఉపఎన్నికలు వాయిదా

ప్రజాశక్తి - యంత్రాంగం

శ్రీసత్యసాయి జిల్లా, పశ్చిమగోదావరి, పల్నాడులో ఉప ఎన్నికలు వాయిదా పడ్డాయి. బలం లేకపోయినా ఎంపిపి, వైస్ ఎంపిపి పదవులు దక్కించుకునేందుకు టిడిపి కూటమి నేతలు కుయుక్తులు పన్నారు. సభ్యులను అడ్డగించడం, ప్రలోభాలకు గురిచేయడం వంటివి చేశారు. కోరం లేకపోవడంతో ఎన్నికలను మరోసారి అధికారులు వాయిదాలు వేశారు. ఘర్షణల నడుమ కైకలూరు వైస్ ఎంపిపి పదవి జనసేన దక్కించుకుంది. ఏలూరు వైస్ ఎంపిపి పదవి టిడిపి ఖాతాలో పడింది. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అప్పట్లో వైసిపి వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు గుప్పించిన టిడిపి, జనసేన నేతలు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదేవిధంగా వ్యవహరించడం చర్చనీయాంశమవుతోంది. గత, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా లేదని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు.

అత్తిలో మోహరించిన పోలీసులు

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని రామగిరి, గాండ్లపెంట ఎంపిపి ఎన్నికకు కోరం లేకపోవడంతో ఎన్నిక ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. రామగిరి ఎన్నికకు సంబంధించి గురువారం జరిగిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను అనంతపురంలోని ఆమె కార్యాలయంలో గృహ నిర్బంధం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో వైస్ ఎంపిపి ఎన్నిక మరోసారి వాయిదా పడింది.

పశ్చిమగోదావరి జిల్లాలో అత్తిలి, యలమంచిలి ఎంపిపి స్థానాల ఎన్నిక మరోసారి వాయిదా పడింది. ఎంపిటిసి సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో ఎన్నిక ప్రక్రియ వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. యలమంచిలిలో కూటమి ఎంపిటిసి సభ్యులు తమను బెదిరిస్తున్నారని వైసిపి నేతలు వాగ్వివాదానికి దిగారు. దీంతో తనకు గుండెనొప్పి వస్తుందంటూ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని వైసిపి ఎంపిటిసి సభ్యులు సుమారు రెండు గంటలపాటు వేచిచూశారు. చికిత్స అనంతరం విశ్రాంతి అవసరమని వైద్యులు తెలపడంతో ఎన్నికల అధికారి కార్యాలయానికి రాలేదు. దీంతో వైసిపి ఎంపిటిసి సభ్యులు వెనుదిరిగారు.

ఏలూరు జిల్లా కైకలూరు వైస్ ఎంపిపి ఎన్నిక ఉద్రిక్తతల నడుమ జనసేనకు చెందిన మంగిన రామకృష్ణ ఎన్నికయ్యారు. ఏలూరు రూరల్ వైస్ ఎంపిపిగా టిడిపికి చెందిన గండికోట నాగరాజును ఎన్నుకున్నారు. అత్తిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏకంగా వందమందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వైసిపి ఎంపిటిసి సభ్యులు మండల పరిషత్ కార్యాలయానికి రాకుండా ఎక్కడికక్కడే టిడిపి నేతలు మోహరించారు. దీంతో 27వ తేదీ జరగాల్సిన ఎన్నిక 28వ తేదీకి వాయిదా పడింది. పరిస్థితుల్లో ఎటువంటి మార్పు లేకపోవడంతో మరోసారి ఎన్నిక వాయిదా పడింది.

జర్నలిస్టులపై దాడులు

ఎంపిపి, వైస్ ఎంపిపి ఎన్నికల సందర్భంగా టిడిపి కూటమి నేతలు జర్నలిస్టులపై దాడులు చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్తిలిలో మండల పరిషత్ కార్యాలయం వద్ద సాక్షి కెమెరామెన్‌ను తోసేయడంతో కెమెరా ధ్వంసమైంది. కైకలూరులో భవ్య న్యూస్ రిపోర్టర్‌పై కూటమి నేతలు దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలై ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జర్నలిస్టులపై దాడులను జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

51 కరువు ప్రభావిత మండలాలు

- సూత్రప్రాయంగా నిర్ణయం
- క్రమం తప్పకుండా ఎండల తీవ్రత పర్యవేక్షణ
- రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నామని రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా వెల్లడించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో శుక్రవారం హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన కరువు ప్రభావ కమిటీ సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు. కరువు మండలాలకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు రెండు మూడు రోజుల్లో వెలువడనున్నాయన్నారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ.. జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కమిటీ నిశితంగా పరిశీలించిందన్నారు. ప్రభుత్వం ఎండల తీవ్రత ప్రభావిత మండలాల కోసం అవసరమైన చర్యలను తీసుకోవడానికి కట్టుబడి ఉందన్నారు. ఈ సమావేశం పరిస్థితులను సమగ్రంగా అంచనా వేసి, సాంకేతిక పరిశీలన ఆధారంగా నిర్ణయం తీసుకునేందుకు కీలకంగా నిలిచిందన్నారు. అదనంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను తాము దృష్టిలో ఉంచుకుని, వర్షపాతం లోటు, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 'డ్రౌట్ మేనేజ్‌మెంట్ మాన్యువల్ ప్రకారం, రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం వేసవి తీవ్రతను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తోందని, ఒకసారి అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే ప్రభుత్వం తగిన విధంగా సహాయ చర్యలు చేపడుతుందన్నారు. అవసరమైన నిధులు, సబ్సిడీలు, సహాయక కార్యక్రమాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం తీసుకునే చర్యల గురించి అదనపు వివరాలను త్వరలో మీడియాకు వెల్లడిస్తామని సిసోడియా పేర్కొన్నారు.

ఫార్మా విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి
- సమగ్ర విచారణ చేయాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

ఫార్మా విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్న ఫార్మా విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులను ఐద్వా, కాంగ్రెస్ మహిళా నాయకులు శుక్రవారం పరామర్శించారు.విద్యార్థి పరిస్థితిపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల నాయకుల ఎదుట బాధితురాలి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. వారిని రమాదేవి ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ... సూసైడ్ నోట్‌లో వెల్లడించిన విషయాలతో పాటు, సిసి ఫుటేజీ, తోటి విద్యార్థుల నుంచి వివరాలు సేకరించి సమగ్ర విచారణ నిర్వహించాలని, నిందితుడైన దీపక్‌పై కఠిన సెక్షన్లతో పాటు రేప్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలి తల్లిదండ్రులు రాజమహేంద్రవరంలో ఉండేందుకు పునరావాసంతో పాటూ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. 'చదువుకోసం ఇక్కడికి రాకపోతే ఇటువంటి పరిస్థితి తలెత్తేది కాదు' అంటూ విద్యార్థిని తన సూసైడ్ నోట్‌లో పేర్కొందన్నారు. ఇటువంటి దారుణమైన పరిస్థితి ఉన్నా ప్రభుత్వం, మంత్రి వర్గం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. ఓ మహిళ హోం మంత్రిగా ఉన్న రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న ఆకృత్యాల నియంత్రణకు చర్యలు శూన్యమన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పద్మశ్రీ మాట్లాడుతూ... వ్యవసాయ కుటుంబంలో జన్మించి అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని బాధితురాలు ఈ స్థాయికి వచ్చిందన్నారు. ఆస్పత్రి యాజమాన్యం నిందితునికి అండగా నిలుస్తోందని విమర్శించారు. సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాజమండ్రికి కేవలం వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న హోం మంత్రి కనీసం పరామర్శకు కూడా రాకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఎఫ్‌టియు ఏలూరు జిల్లా కార్యదర్శి యామిని, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, అధ్యక్షులు జరీనా, జిల్లా ఉపాధ్యక్షులు కాశీ అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

పి4 ప్రారంభానికి 13 వేల మంది తరలింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న పి-4 విధానం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల మందిని తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అమరావతిలోని వెలగపూడిలో సచివాలయం సమీపాన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఏలూరు, కృష్ణా, గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లా నుంచి 7 వేల మందిని, పల్నాడు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 1,500 మందిని, మిగిలిన జిల్లాల్లో ఒక్కో జిల్లా నుంచి 300 మందిని సమీకరించి, తరలించనున్నారు. ఇందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌శాఖ ఐజి హరినారాయణ నేతృత్వంలోని ముగ్గురు అధికారుల బృందాన్ని నియమించింది. ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని, ప్రతి బస్సుకు ఒక లైజన్ అధికారి అందుబాటులో ఉంటారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఉగాది సందర్భంగా ఈ నెల 30న నిర్వహించే కార్యక్రమంలో పి-4 విధానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఆదివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకూ జరిగే ఈ కార్యక్రమానికి మధ్యాహ్నం 3 గంటలలోపు వేదిక వద్దకు ప్రజలను చేర్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎస్‌హెచ్‌సి సభ్యులను, ఉపాధి కూలీలను, రైతులు, విద్యార్థులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో తీసుకురానున్నారు.

నేడు 223 మండలాల్లో వడగాడ్పులు

- మరో 35 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు
- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా శనివారం 223 మండలాల్లో వడగాడ్పులు, మరో 35 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం తీవ్ర వడగాడ్పులు వీచే మండలాలు.. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఆరేసి, పార్వతీపురం మన్యం 12, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల్లో మూడేసి, తూర్పుగోదావరిలో 2 మండలాలు ఉన్నాయి. వడగాడ్పులు వీచే మండలాలు శ్రీకాకుళం జిల్లాలో 19, విజయనగరం 16, పార్వతీపురం మన్యం 12, అల్లూరి సీతారామరాజు 8, విశాఖ 3, అనకాపల్లి 16, కాకినాడ 15, అంబేద్కర్ కోనసీమ 12, తూర్పుగోదావరి 17, పశ్చిమ గోదావరి 10, ఏలూరు 17, కృష్ణా 15, ఎన్‌టిఆర్ 12, గుంటూరు 17, బాపట్ల 8, పల్నాడు 24, ప్రకాశం 9, నెల్లూరు 1, తిరుపతి 2 మండలాలు ఉన్నాయి. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రకాశం జిల్లా తాటిచెర్ల, వైఎస్‌ఆర్ జిల్లా కమలాపురంలో 42.6 డిగ్రీల చొప్పున, నంద్యాల జిల్లా ఆలమూరులో 42.5, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 42.2, అనకాపల్లి జిల్లా రావికమతంలో 42.1, అన్నమయ్య జిల్లా వతలూరులో 42, అనంతపురం జిల్లా గుంతకల్లు, పల్నాడు జిల్లా నడిగడ్డలో 41.9, విజయనగరం జిల్లా నెలివాడలో 41.8, నెల్లూరు జిల్లా నెల్లూరు పాలెంలో 41.5, చిత్తూరు జిల్లా నగరి, కర్నూలు జిల్లా ఉలిందకొండలో 41.1 చొప్పున అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వీటితోపాటు 181 ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు కూర్మనాథ్ తెలిపారు.

పది మంది మావోయిస్టుల లొంగుబాటు

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా)

ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందిన పది మంది మావోయిస్టులు శుక్రవారం అల్లూరి జిల్లా పాడేరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి అమిత్ బర్దర్ ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారంతా ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఆపరేషన్ కగార్, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సరళ్ కార్యక్రమానికి ఆకర్షితులయ్యారని ఎస్‌పి మీడియాకు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.80 లక్షల రివార్డు ఉందని వెల్లడించారు. కడితి, కొవ్వాసి సుక్కి, సోడికోసా, సోడి రాజు, మడకం పొజ్జ, ముచ్చకి గంగ, బాడిస భీమయ్య, కురసం నాగరాజు, కలుముల రాజు, కడిపి రామ లొంగిపోయిన వారిలో ఉన్నారని ఎస్‌పి తెలిపారు.

మిర్చి రైతుల సమస్యలపై దృష్టి

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని, గుంటూరు మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు, బ్యాంకర్లు, కోల్డ్ స్టోరేజీ యాజమాన్యాలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతుల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల ట్రేడర్స్ నుంచి గుంటూరు మిర్చి యార్డుకు వస్తున్న సరుకుపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బయట రాష్ట్రాల నుంచి ఎక్కువ మొత్తంలో మిర్చి రావడం వల్ల ఇక్కడ రైతులు పండించే పంటకు సరైన ధర రావట్లేదనే వాదన కూడా ఉందన్నారు. బయట రాష్ట్రాల నుంచి మిర్చి పంటను రైతులు మాత్రమే తెచ్చి అమ్ముకోవడానికి అవకాశం ఉందన్నారు. తిరుపతి, విశాఖ, విజయవాడ, రాజమండ్రి, గుంటూరు మెట్రోపాలిటన్ నగరాల్లో ఒక్కో రైతు బజారును సకల సౌకర్యాలతో మోడరన్ రైతు బజారుగా కట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగ్గయ్యపేట కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం నిర్వాకం కారణంగా మిర్చి రైతులు సర్వం కోల్పోయారన్నారు. యాజమాన్యం ఇన్సూరెన్స్ పునరుద్ధరించకపోవడంతో రైతులకు నష్టం జరిగిందన్నారు. ఇన్సూరెన్స్ పునరుద్ధరించకుండా ఉన్న కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. మిర్చి రైతులకు రుణాలను వెంటనే మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, మార్కెటింగ్‌శాఖ కమిషనరు విజయ సునీత, జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ పాల్గొన్నారు.

ఇంధన వనరుల అభివృద్ధికి చర్యలు : సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దయెత్తున చర్యలు తీసుకుంటోందని ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో నీతి ఆయోగ్ ప్రతినిధి బృందం శుక్రవారం సిఎస్‌తో భేటీ అయి, ఇంధన రంగంలో అమలు చేయనున్న వ్యూహాత్మక రూట్ మ్యాప్‌పై చర్చించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ (2024)లో భాగంగా 160 గిగావాట్లకు పైగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇంధన వనరుల అభివృద్ధిలో భాగంగా సోలార్, విండ్, గ్రీన్ హైడ్రోజన్ ఇంధన ఉత్పత్తిలో పెద్దయెత్తున పెట్టుబడులు ఆకర్షించి పలు ప్రాజెక్టులు నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల విశాఖపట్నం సమీపంలో ఎన్‌టిపిసి, ఎన్ఆర్ఇడిసి ఎపి భాగస్వామ్యంలో ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్రాజెక్టుకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారన్నారు. కాకినాడలో గ్రీన్‌కో గ్రూప్‌తో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, ఎలక్ట్రోలైజర్ తయారీ, ఎపి జెన్‌కో, కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌హెచ్‌పిసితో జాయింట్ వెంచర్‌తో 6వేల మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, ఇతర పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఇంధన పరివర్తన ప్రణాళికలో భాగంగా మహారాష్ట్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ అందిస్తున్న సేవలు, ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నీతి ఆయోగ్ బృందం సిఎస్‌కు వివరించింది. 2047 నాటికి రాష్ట్రంలో ఎంపిక చేసుకున్న లక్ష్యాలను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు నీతి ఆయోగ్ సిద్ధంగా ఉన్నట్లు బృందం తెలిపింది. ఈ సమావేశంలో ఎపి ఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్, ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి కె సంతోషరావు, ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి ఎకెవి భాస్కర్‌తోపాటు నీతి ఆయోగ్ ప్రతినిధి బృందంలో అన్న భరద్వాజ్, శిరీష్ సాంభే, సుశ్రుత్ హెల్వాత్కర్, దీపక్ బవారీ, రోన్ని ఖన్నా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లోనూ ఆస్తిపన్ను వసూలు

- ప్రత్యేక కౌంటర్లకు ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆస్తిపన్ను వసూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ నెలాఖరులో సెలవులు ఉండటంతో 30, 31 తేదీల్లోనూ వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికోసం పట్టణాభివృద్ధిశాఖ సర్క్యులర్ జారీ చేసింది. ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో మార్చి నెలాఖరులోపు మొత్తం బకాయిలు వసూలు చేసేలా చూడాలని టార్గెట్లు పెట్టింది. దీనికోసం చివరి రెండు రోజుల్లోనూ సెలవు దినాలు ఉన్నప్పటికీ ఉద్యోగులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కమిషనర్లను ఆదేశించింది. ఆస్తిపన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించిన నేపథ్యంలో ఎక్కువగా వసూలయ్యే అవకాశం ఉంటుందని, దీనికి అనుగుణంగా ఉదయం ఆరుగంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకూ ప్రత్యేక కౌంటర్లు పనిచేసేలా చూడాలని పేర్కొంది. నేరుగా వచ్చి చెల్లించడంతోపాటు ఆన్‌లైన్లోనూ కట్టొచ్చని, దీనికోసం బకాయిదారులను చైతన్యం చేయాలని తెలిపింది.

బ్యాంక్‌ల్లో సోమవారం ప్రత్యేక క్లియరింగ్ సెషన్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ముగింపు నేపథ్యంలో మార్చి 31 సోమవారం నాడు ప్రత్యేక క్లియరింగ్ సెషన్‌ను నిర్వహించాలని బ్యాంక్‌లకు రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యేక క్లియరింగ్ కార్యకలాపాల్లో అన్ని బ్యాంకులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించింది. ఆర్థిక సంవత్సరం ముగింపు రోజే ప్రభుత్వ ఆదాయం, చెల్లింపులు పూర్తికావాల్సి ఉన్నందున వాటి లావాదేవీలు నిర్వహించే బ్యాంకులు కార్యకలాపాలను నిర్వర్తించేలా ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంది. బ్యాంక్‌లతో పాటుగా ఐటి శా, సిజిఎస్‌టి కార్యాలయాలు ఈ నెల 29, 30, 31వ తేదీల్లో పని చేయనున్నాయి. ఈ నెల 31న రంజాన్ ఉన్నప్పటికీ ఆయా కార్యాలయాలు పని చేయనున్నాయి.

సమ్మెలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

సమ్మెలో భాగంగా భారీ బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మె విజయవంతం

ప్లాంట్‌లోని హెచ్‌ఒడి కార్యాలయాల వద్ద నిరసనలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన ఒక రోజు సమ్మె శుక్రవారం విజయవంతమైంది. విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి చేర్చుకోవాలని, మెడికల్ టెస్టుల పేరిట తొలగింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, 30 శాతం కాంట్రాక్టు కార్మికులను ప్రతి టెండర్‌లో బలవంతంగా తొలగించడాన్ని ఆపాలని, గేట్ పాస్‌లను పాత విధానంలోనే కొనసాగించాలని ఉక్కు యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తూ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు ఈ సమ్మెకు దిగాయి. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకూ తలపెట్టిన ఈ సమ్మెలో భాగంగా కాంట్రాక్ట్ కార్మికులు విధులు బహిష్కరించారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిరంకుశంగా, మొండిగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పొట్ట కొడుతూ సెంట్రల్ లేబర్ కమిషనర్ ఆదేశాలను బేఖాతరు చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా ప్లాంట్‌లోని హెచ్‌ఒడి కార్యాలయాలను ముట్టడించి నిరసనలు తెలిపారు. అనంతరం స్టీల్ ప్లాంట్ ప్రధాన పరిపాలనా భవనానికి ర్యాలీగా వచ్చి అక్కడ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1,150 మంది కాంట్రాక్టు కార్మికులను ఇప్పటికే తొలగించారని, 5,500 మందికిపైగా కార్మికులను తొలగించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. యాజమాన్యం తమ సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన వారిని కాంట్రాక్టు కార్మికులుగా నియమించుకున్నారని తెలిపారు. ప్రస్తుతం వేతనాలను ఆలస్యంగా చెల్లిస్తున్నా ఆర్థిక కష్టాలను దిగమింగుతూ కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఉన్నఫళంగా తమను ఇప్పుడు విధుల నుంచి తొలగిస్తే ఎక్కడికి వెళ్లి బతకాలని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసనలకు, సమ్మెకు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, జి శ్రీనివాస్, సత్యవతి, మంత్రి రవి, వంశీ, గురునాధరావు, ఉమ్మిడి అప్పారావు, ఉరుకూటి అప్పారావు నేతృత్వం వహించారు. సమ్మెకు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) మద్దతు తెలిపింది.

వక్ఫ్ బిల్లుపై సిఎం డబుల్‌గేమ్

- పార్లమెంటులో టిడిపి మద్దతు
- వైసిపి పిఎసి సభ్యులు ఆసిఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వక్ఫ్ సవరణ బిల్లుపై సిఎం చంద్రబాబు డబుల్‌గేమ్ ఆడుతున్నారని, బిల్లుకు పార్లమెంటులో మద్దతు ఇచ్చి ఇక్కడ ఆస్తుల పరిరక్షణ అంటూ నాటకాలు ఆడుతున్నారని వైసిపి పిఎసి సభ్యులు షేక్ ఆసిఫ్ తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముస్లిముల హక్కులను కాలరాయడంతో చంద్రబాబు భాగస్వామి అయ్యారని, వారి సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఈ బిల్లుకు వైసిపి పూర్తి వ్యతిరేకమని చెప్పారు. పార్లమెంటులో వైసిపి ఎంపిలు బిల్లును తిరస్కరించారని, ఇదే విషయాన్ని జెపిసికి రాతపూర్వకంగా తెలిపారని వివరించారు. రాజకీయ ప్రయోజనాలే ముఖ్యంగా వక్ఫ్ సవరణ బిల్లుకు చంద్రబాబు మద్దతు తెలిపారని అన్నారు. టిడిపి మద్దతుపై కేంద్రం ఆధారపడి ఉందని, ఆ బిల్లును ఆదిలోనే టిడిపి వ్యతిరేకించి ఉంటే ఇప్పుడు జెపిసి వరకూ వచ్చి ఉండేది కాదని అన్నారు. ఒకపక్క బిల్లుకు మద్దతు ప్రకటిస్తూనే మరోవైపు ఇఫ్తార్ విందులో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కట్టుబడ్డానని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. వక్ఫ్ భూములకు సంబంధించిన ట్రిబ్యునల్ ఉన్నా కేంద్రం దాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. వాటిపై కలెక్టర్లకు అథారిటీ ఇవ్వాలని వైసిపి డిమాండ్ చేస్తోందన్నారు.

పన్నుల ఆదాయం విలాసాలకు తగదు

- గిఫ్ట్ కూపన్లను తిరస్కరించిన సిపిఎం కార్పొరేటర్
- రూ.48 లక్షలు ఖర్చు చేసిన జివిఎంసి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

తిరస్కరించిన గిఫ్ట్ కూపన్‌ను చూపుతున్న బి.గంగారావు

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదన సందర్భంగా ప్రతి కార్పొరేటర్‌కూ, ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీలకూ రూ.25 వేల విలువ గల సిఎంఆర్ షాపింగ్ మాల్ గిఫ్ట్ కూపన్‌ను ఇవ్వగా దాన్ని సిపిఎం 78వ వార్డు (ఉక్కునగరం) కార్పొరేటర్ బి.గంగారావు తిరస్కరించారు. ఆ కూపన్‌ను తిరిగి జివిఎంసికి వాపస్ చేశారు. మిగతా ప్రజా ప్రతినిధులూ ఆ కూపన్స్‌ను తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ ప్రజల పన్నుల చెల్లింపు ద్వారా వచ్చిన ఆదాయాన్ని జివిఎంసి బడ్జెట్ సందర్భంగా ఇలా విలాసాలకు కేటాయించడం తగదని పేర్కొన్నారు. కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిల షాపింగ్ కోసం సుమారు రూ.48 లక్షల మేర ఖర్చుచేయడం అంటే ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనన్నారు. ఇప్పటికే ప్రతి ఏడాదీ అధ్యయన యాత్రల పేర వినోదయాత్రలు చేపట్టి కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారని, గత మూడు అధ్యయన యాత్రల సమయంలో కనీస నివేదికలు తయారు చేయలేదు సరికదా ఆస్తి పన్నును ఆస్తి విలువ ఆధారంగా మార్చి ప్రజలపై తీవ్ర భారం మోపారన్నారు. విశాఖ ప్రజల ప్రయోజనాలకు, మౌలిక సదుపాయాలు, మురికి వాడలు, కొండవాలు ప్రాంతాలు, విలీన ప్రాంతాల అభివృద్ధికి, ప్రభుత్వ విద్య, వైద్యం, క్రీడలు, గ్రంథాలయం, వినోదం వంటి వాటిని ప్రాధాన్యతలుగా ఎంచుకొని బడ్జెట్ నిధులు వినియోగించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా జివిఎంసి నిధులు కేటాయించడం లేదని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడని వాటిమీద, విలాసవంతమైన వాటిమీద, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం నిధులు వెచ్చిస్తూ ప్రజల మౌలిక సదుపాయాలను, పౌరసేవలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ విధానాలు జివిఎంసిలో ఊపందుకున్నాయన్నారు. ఈ ప్రమాదకర విధానాలను ప్రజలు, పౌర సంస్థలు, కాలనీ సంఘాలు, అసోసియేషన్లు, మేధావులు అందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యాన శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అంతర్జాతీయ ధర ప్రకారం కోకో గింజలు కొనాలి

- ఉద్యాన శాఖ డైరెక్టర్‌కు రైతు సంఘాల వినతి

ప్రజాశక్తి-గుంటూరు

కోకో గింజలను అంతర్జాతీయ ధర ప్రకారం ఆయా కంపెనీలతో కొనిపించాలని రాష్ట్ర కోకో రైతుల సంఘం, ఎపి రైతుసంఘం, కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. గుంటూరులోని ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు, డిడి హరనాథ రెడ్డి ఇతర అధికారులకు రైతు సంఘాల నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 75 వేల ఎకరాల్లో కోకో పంటను అనేక కష్ట, నష్టాలకోర్చి సాగుచేస్తున్నారన్నారు. గతేడాది అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజలకు కిలోకు రూ.1040లు ధర వచ్చిందని, ప్రస్తుతం మార్కెట్‌లో రూ.900లు ధర ఉన్నా కంపెనీలు ఆ ధర చెల్లించట్లేదని తెలిపారు. పాత, కొత్త గింజల పేరుతో రైతుల్ని కంపెనీలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, కంపెనీలు సిండికేట్‌గా మారి కిలోకు రూ.450ల నుండి రూ.500లు మాత్రమే ధర ఇస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలా కాకుండా గ్రేడింగ్ విధానం తీసుకొచ్చి రైతుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. కోకో గింజల ధర పెరిగిన తర్వాత కౌలు రేట్లు పెరిగాయని తెలిపారు. ఇటీవల ఎరువులు, ఇతర ఖర్చులు కూడా పెరిగాయన్నారు. కానీ, అంతర్జాయ మార్కెట్ ధరకు అనుగుణంగా కోకో గింజలు కొనుగోలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారనిర తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈ నెల 17న జరిగిన ఉమ్మడి సమావేశంలోని నిర్ణయాల ప్రకారం అంతర్జాతీయ మార్కెట్ ధరకు కంపెనీలు గింజలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, కంపెనీలు కొనుగోలు చేయకపోతే ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతుల్ని ఆదుకోవాలని, ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింప చేయాలని, విదేశాల నుండి దిగుమతులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, నాయకులు కోనేరు సతీష్‌బాబు, కొసరాజు రాధాకృష్ణ, జి వీరారెడ్డి, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, నాయకులు పి రంగారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న చీఫ్ సూపరింటెండెంట్ కరిముల్లా

పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌కు పాముకాటు

ప్రజాశక్తి-చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

పదో తరగతి పరీక్షా కేంద్రంలో తనిఖీలకు వెళ్లిన చీఫ్ సూపరింటెండెంట్ పాముకాటుకు గురైన ఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో శుక్రవారం జరిగింది. చీఫ్ సూపరింటెండెంట్ కోమటినేనివారిపాలెం జడ్‌పి పాఠశాల హెచ్‌ఎం కరిముల్లా స్థానిక మదర్ థెరిస్సా కాలనీలోని వేద స్కూల్లో శుక్రవారం ఉదయం తనిఖీలకు వెళ్లారు. ఈ క్రమంలో ఒక గదిలోని విద్యార్థులు పామును చూసి అరిచారు. దీంతో అక్కడుకు వెళ్లిన చీఫ్ సూపరింటెండెంట్ పామును బయటకు పంపించే ప్రయత్నం చేయగా కాలిపైన పాము కాటు వేసింది. దీంతో ఆయనను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది.

ఎసిబి వలలో కాకినాడ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు, సీనియర్ అసిస్టెంట్ ఎసిబి వలకు చిక్కారు. రూ.లక్ష లంచం తీసుకుంటుండగా వారిని ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి కిశోర్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ జిల్లా తునికి చెందిన ఆర్.రమేష్‌బాబు తన భార్య పేరున సమత గ్యాస్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. ఇటీవల ఏజెన్సీని తన పేరును మార్చుకోవాలనుకున్నారు. దీని కోసం జిల్లా రిజిస్ట్రార్‌ను ఆశ్రయించారు. అందుకు రిజిస్ట్రార్ లక్ష రూపాయలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించారు. దీంతో బాధితుడి నుండి రిజిస్ట్రార్ ఆనందరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి లంచం తీసుకుంటుండగా శుక్రవారం ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఆనందరావు నుంచి రూ.లక్ష, శ్రీనివాసరెడ్డి నుంచి రూ.25 వేలు, అనధికారికంగా ఉన్న మరో రూ.80 వేల నగదును, ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా ఉన్న డాక్యుమెంట్ రైటర్ వెలుగుల జగదీష్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎసిబి డిఎస్‌పి తెలిపారు.

ఎంజి నుంచి కొత్త ఆస్టర్ 'బ్లాక్ బస్టర్ ఎస్‌యువి'

న్యూఢిల్లీ : సరికొత్తగా ఎంజి ఆస్టర్‌ను మై 2025 ఎడిషన్‌తో బ్లాక్ బస్టర్ ఎస్‌యువిని విడుదల చేసినట్లు జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తెలిపింది. దీని కొత్త షైన్ వేరియంట్ ఎక్స్‌షోరూం ధరను రూ.12.5 లక్షలుగా నిర్ణయించింది. తమ శ్రేణీలో ఏకైక ఎస్‌యువిగా నిలిచిందని తెలిపింది. ఇది ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 1.5 లీటర్, 1.3 టర్బో ఇంజిన్ తదితర 50కి పైగా ఫీచర్లతో లభిస్తుందని పేర్కొంది.

చంద్రబాబు హయాంలోనే
పోలవరం 72 శాతం పూర్తి

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు (పశ్చిమగోదావరి జిల్లా)

2014-19లో పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు పట్టాలెక్కించి 72 శాతం పూర్తి చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులోని తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. 2019లో రివర్స్ టెండరింగ్ పేరు చెప్పి 17 నెలలు ఏజెన్సీ లేకుండా జగన్ రెండో విధ్వంసం చేశారని, నాడు మధుకాన్ కాంట్రాక్టర్‌ను రద్దుచేసి రాజశేఖర్ రెడ్డి మొదటి విధ్వంసం చేశారని విమర్శించారు. చంద్రబాబు, పోలవరం గురించి జగన్ విధ్వంస ముఠా మాట్లాడుతుంటే రావణాసురుడు రాముడు గురించి, రాక్షసులు యజ్ఞాలు, యాగాల గురించి మాట్లాడుతున్నట్లు ఉందని దుయ్యబట్టారు. 'పోలవరం నాకు అర్థం కాలేదు, అందుచేత ఎవరికీ అర్థం కాదు. పోలవరం ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేం' అన్న ఇరిగేషన్ శాఖ మాజీ మంత్రికి పోలవరం గురించి మాట్లాడే నైతిక అర్హత ఉందా? అని ప్రశ్నించారు. 2020 ఆగస్టు వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతిని పోతే, 2021 జూన్, డిసెంబర్, 2022 జూన్ అంటూ అంటే డయాఫ్రం వాల్ ఉందో లేదో తెలియకుండా నాటి సిఎం జగన్ అసెంబ్లీలో మాట్లాడాడని విమర్శించారు. పోలవరం చరిత్రలో ఫేజ్-1, ఫేజ్-2 అంటూ 41.15, 45.72 మీటర్లకు తీసుకొచ్చింది జగన్ అని తెలిపారు. పోలవరం కుడి, ఎడమ కాలువల నీటి సామర్థ్యం 17,500 క్యూసెక్కుల నుంచి తొమ్మిది వేలకు, ఆరు అడుగుల వేలకు తగ్గించి ఉత్తరాంధ్రకు, రాయలసీమకు ద్రోహం చేసిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. తొమ్మిది నెలలు టిడిపి కూటమి పాలనలో పోలవరానికి రూ.5052 కోట్లు అడ్వాన్స్‌గా చంద్రబాబు సాధించారన్నారు. ఎగువ కాఫర్ డ్యామ్ బలోపేతానికి బట్రస్ డ్యాం పనులు జరుగుతున్నాయని చెప్పారు.

ఎఫియాసాఫ్ట్‌లో జాగల్‌కు 51 శాతం వాటా

హైదరాబాద్ : జాగల్ ప్రీపెయిడ్ ఒసియన్ సర్వీసెస్ లిమిటెడ్ మరో కంపెనీలో కీలక వాటాను స్వాధీనం చేసుకుంది. తాజాగా ఎఫియాసాఫ్ట్ ప్రయివేటు లిమిటెడ్‌లోని 51 శాతం మెజారిటీ వాటాను కొనుగోలు చేసినట్లు జాగల్ శుక్రవారం వెల్లడించింది. ప్రస్తుత వాటాదారులు కౌశిక్ షీ, క్రిష్ణారావు అకులకు చెందిన 45.33 శాతం వాటాను రూ.36.72 కోట్లతో దక్కించుకుంది. మరో 5.67 శాతం వాటాను అదే వాటాదారుల నుంచి రూ.4.59 కోట్లకు పొందనున్నట్లు వెల్లడించింది. మోబిల్‌వేర్ టెక్నాలజీస్‌లో 38 శాతం వాటానుయ రూ.22.85 కోట్లతో స్వాధీనం చేసుకున్నట్లు జాగల్ ఇంతక్రితం రోజు ప్రకటించిన విషయం తెలిసిందే.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- అధికారులకు మంత్రి నారాయణ ఆదేశం
- వేసవి యాక్షన్ ప్లానుపై సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో వేసవి యాక్షన్‌ప్లాను, తాగునీటి ఎద్దడి అంశాలపై శుక్రవారం ఉదయం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు నింపడం, బోర్‌వెల్స్ రిపేర్లు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రాయలసీమ ప్రాంతాల్లోనూ, ప్రకాశం జిల్లాలోనూ అధికారులు ఇప్పటివరకూ ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ వేసవి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో తాగునీటి సరఫరా అంశంలో జాప్యం చేయొద్దన్నారు. ముందుగా ట్యాంకులు నింపడం, రిపేర్లయిన బోర్లను బాగు చేయించడం, అలాగే నీటి ధార తగ్గిన ప్రాంతాల్లో వాటిని లోతుకు వేయించడం వంటి అంశాలపై నిర్లక్ష్యం వద్దని, ఇప్పటి నుండే పనులు మొదలుపెట్టాలని సూచించారు. ప్రకాశం జిల్లాలో సమస్య తీవ్రత ఉన్న నేపథ్యంలో అక్కడ ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. 43 మున్సిపాలిటీల్లో 1,343 వార్డుల్లో ఇప్పటికీ రోజు మార్చి రోజు నీటిని సరఫరా చేస్తున్నారని, అక్కడ నీటి ఎద్దడి వచ్చే అవకాశాలు ఉంటాయని, అలా కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూడురోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్న పట్టణ ప్రాంతాల్లో అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. అన్ని మున్సిపాలిటీల్లోనూ ట్యాంకర్లను ముందుగానే తీసుకోవాలని, చివరి నిమిషంలో హడావుడి చేయొద్దని సూచించారు. బోర్‌వెల్స్ రిపేర్లకు సంబంధించి కమిషనర్లు నేరుగా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. అత్యవసర ఖాతా నుండి నిధులు వెంటనే విడుదల చేసుకోవచ్చని తెలిపారు. నిధుల పేరుతో పనులు ఆలస్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్, డైరెక్టర్ సంపత్‌కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ మరియన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌పి ఎస్‌ఇ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

సాగునీటి కోసం రైతుల ధర్నా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సాగునీటి కోసం రైతులు ఆందోళనకు దిగారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎన్‌ఎస్‌పి (నాగార్జున సాగర్ ప్రాజెక్టు) కార్యాలయం వద్ద ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో మిర్చి, వరి, మొక్కజొన్న రైతులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ.. రానున్న నెల రోజులు పైరుకు కీలకమని, కనీసం పెట్టుబడులైనా రావాలంటే సాగునీరు అందించాల్సిందేనని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పిన ప్రభ్వుం మోసం చేసిందని, కనీసం సాగుకు నీరైనా ఇవ్వలేదా? అని నిలదీశారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలోనే సాగర్‌లో డెడ్‌స్టోరేజ్‌లో నీరున్నా మోటార్ల ద్వారా సాగునీరు అందించారని, ప్రస్తుతం డెడ్‌స్టోరేజి కంటే అదనంగా నీరుందని తెలిపారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులకు వ్యవసాయంపై సరైన ప్రణాళిక లేకపోవడమే ప్రస్తుత పరిస్థితికి కారణమన్నారు. ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేశారో గుర్తించి, అందుకు అనుగుణంగా నీరివ్వాల్సి ఉన్నా శాఖల మధ్య సమన్వయ లోపంతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో నీరు వృథా అవుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో అసలు అందడం లేదన్నారు. అనంతరం ఎస్‌ఇ పి.కృష్ణమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ, క్రోసూరు, సత్తెనపల్లి, ముప్పాళ్ల, నరసరావుపేట మండలాల రైతులు పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులతో కర్నూలు కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ధర్నా

మెయిన్స్ పరీక్షలు వెంటనే నిర్వహించాలి

- పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని, పాత పద్ధతిలోనే హోంగార్డుల రిజర్వేషన్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు కర్నూలు జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన ర్యాలీలో జిల్లా కార్యదర్శి వై నగేష్, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్లా పోలీస్ కానిస్టేబుల్ నిరుద్యోగ నాయకులు బాబు నాయక్, నాగార్జున మాట్లాడుతూ అధికారంలోకొస్తే ఆరు నెలలలోపు నోటిఫికేషన్‌ను పూర్తి చేస్తామనినారా లోకేష్ ఎన్నికల ముందు హామీ ఇచ్చారన్నారు. తొమ్మిది నెలలైనా ఒక్కసారైనా మంచి న్యాయవాదిని పంపించి న్యాయపరమైన చిక్కులను తొలగించడం లేదన్నారు. ఫిజికల్ ఈవెంట్స్ పూర్తి చేసుకుని మెయిన్స్ ఎగ్జామ్స్ కోసం ఎదురు చూస్తున్నా 39,000 మంది నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని సమస్య పరిష్కరించా లని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు అసెంబ్లీని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ బాష, నగర ఉపాధ్యక్షులు మహేష్, ఓల్డ్ సిటీ కార్యదర్శి అంజి, నిరుద్యోగ నాయకులు నరేష్, రమేష్, ఎపి కానిస్టేబుల్ అభ్యర్థులు 200 మంది పాల్గొన్నారు.

చివరి రోజు మార్కెట్లకు నష్టాలు

వరుసగా మూడు రోజులు సెలవు

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ సెషన్‌లో దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలను చవి చూశాయి. అమ్మకాల ఒత్తిడితో శుక్రవారం సెన్సెక్స్ 191 పాయింట్ల నష్టంతో 77,415 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 72.60 పాయింట్ల తగ్గుదలతో 23,519కు చేరింది. ఏప్రిల్ 2న భారత్‌పై సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేయనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించి.. అమ్మకాలకు మొగ్గు చూపారు. ముఖ్యంగా ఐటి, ఆటోమొబైల్ షేర్లలో ప్రతికూలత చోటు చేసుకుంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు కోటక్ మహీంద్రా బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసిఐసిఐ బ్యాంక్, టాటా మోటార్స్, నెస్లే ఇండియా షేర్లు లాభపడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) స్థూలంగా మార్కెట్లు 5 శాతానికి పైగా పెరిగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 7.48 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 5.4 శాతం చొప్పున లాభాలను నమోదు చేశాయి. శని, ఆదివారాలు సాధారణ సెలవులు కావడంతో పాటుగా సోమవారం రంజాన్ నేపథ్యంలో మార్కెట్లకు వరుసగా మూడు రోజులు సెలవులు రానున్నాయి.

నిఫ్టీ నెక్ట్స్ 50లోకి హ్యుందాయ్

హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్‌ఎంఐఎల్) నిఫ్టీ నెక్ట్స్ 50, నిఫ్టీ 100, నిఫ్టీ 500, బిఎస్‌ఇ 500లోకి చేరినట్లు వెల్లడించింది. 2024 అక్టోబర్ 22న లిస్టింగ్ అయిన ఈ కంపెనీ అనాతి కాలంలోనే మార్కెట్‌లో దూసుకెళ్లింది. దీంతో తాము మరో కీలక మైలురాయిని దాటామని హెచ్‌ఎంఐఎల్ ఎండి అన్సూ కిమ్ పేర్కొన్నారు. భారత స్టాక్ ఎక్స్ఛేంజీల్లో హెచ్‌ఎంఐఎల్ స్థానాన్ని బలోపేతం చేశామన్నారు.

స్ఫూర్తిదాయకం

సంపాదకీయం

కేరళలోని వయనాడ్ జిల్లాలో గతేడాది కొండ చరియలు విరిగిపడి భారీ విపత్తు బారినపడ్డ బాధితులను ఆదుకునేందుకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టడం బహు ప్రశంసనీయం. గతేడాది జులై 30న మండక్కై, చూరాల్‌మల సహా పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. అనేకమంది గల్లంతయ్యారు. ఈ విలయానికి 402 కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయి. ఇళ్లు నిర్మించాలని కోరిన 242 కుటుంబాల్లో... 175 కుటుంబాలకు తొలి దశగా కాల్పెట్టలోని ఎల్‌స్టన్ ఎస్టేట్‌లో ప్రభుత్వం నిర్మించనున్న టౌన్‌షిప్‌నకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం శంకుస్థాపన చేశారు. రెండో దశలో మరో 70 మంది లబ్ధిదారులకు ఇళ్లను లేదా పరిహారాన్ని, మిగిలిన వారు కోరుకున్న విధంగా ఆర్థిక సాయాన్ని అందిస్తారు. ఒక్కో ప్లాటుకు ఏడు సెంట్లు చొప్పున వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంతో రెండు పడక గదులు, అటాచ్డ్ బాత్ రూం, లివింగ్ రూమ్, డైనింగ్ ఏరియా, వర్క్ ఏరియా, సిట్ అవుట్, స్టడీ రూమ్‌తో నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం సుమారు రూ.20 లక్షలు కావచ్చునని అంచనా! కేంద్రం ఆదుకోకపోయినా ప్రజలంతా ఐక్యంగా మానవతతో అందిస్తున్న సహాయ, సహకారాలే పునరావాస చర్యలను కొనసాగించడంలో తమ ప్రభుత్వానికి స్ఫూర్తినిస్తున్నాయని విజయన్ తెలిపారు. నిరుపేదలు మొదలు సంపన్న వ్యాపారుల వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారని, చిన్నారులు సైతం తాము దాచుకున్న చిన్నచిన్న మొత్తాలను విపత్తు బాధితుల సహాయార్థం అందించి గొప్ప మానవత్వాన్ని ప్రదర్శించారని వివరించడం ద్వారా విపత్తు సమయంలోనూ, తదనంతరమూ బాధితులను ఆదుకోవడంలో ప్రజల పాత్రను విజయన్ విశదపరిచారు. మహా విపత్తులో బాధితుల కోసం పెద్ద ఎత్తున కొనసాగుతున్న పునరావాస పనులు కేరళ ప్రజల ఐక్యతకు గొప్ప ఉదాహరణ అని, ప్రజా చైతన్య స్ఫూర్తిని ఏ ప్రకృతి విపత్తూ ఓడించజాలదన్న పినరయి మాటలు ప్రత్యక్షర సత్యాలు. 'ప్రజలు మనతో ఉంటే అసాధ్యమంటూ ఏదీ ఉండదు. మనం మనుగడ సాగించగలం. ఇక్కడ కొనసాగుతున్న పునరావాస పనులు ఇచ్చే సందేశమిదే' అని విజయన్ అన్నారు. 'ఏ ఒక్క బాధితుడు ఒంటరిననే బాధతో ఉండరాదని, ఆ దిశగా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తోందని, కోల్పోయిన ఆప్తులనైతే తిరిగి తీసుకురాలేం కానీ వారిని అన్ని విధాల ఆదుకుంటామ'ని ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కె రాజన్ చెప్పడం బాధితుల గుండె నిండా భరోసా నిలుపుతుంది.

ప్రపంచ నలుమూలల నుంచి ప్రజలు వివిధ రూపాల్లో సాయం అందించగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి స్పందించే హృదయం లేకపోయింది. ఇప్పటివరకు చిల్లిగవ్వ సాయం కూడా అందించకపోవడం కమలనాథుల పాషాణ హృదయానికి నిలువుటద్దం. పునరావాసం కోసం కేంద్రం తన మూలధన పెట్టుబడి పథకం నుంచి దాదాపు రూ.529.50 కోట్ల రుణం మాత్రమే మంజూరు చేసింది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపట్ల బిజెపి కేంద్ర ప్రభుత్వం ఎంత వివక్షాపూరితంగా వ్యవహరిస్తుందో చెప్పడానికిది గొప్ప నిదర్శనం. వరదలు, కోవిడ్ ఇలా ఒకదాని వెంబడి ఒకటి వరుసగా ఇబ్బందులు రావడంతో ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు రాష్ట్రం పోరాడుతున్న సమయంలో సంభవించిన ఈ ప్రకృతి విపత్తును తట్టుకొని, ధీరోదాత్తంగా నిలబడడం స్ఫూర్తిదాయకం. కేంద్రం మొండిచెయ్యి చూపించిన నేపథ్యంలో పునరావాస పనుల్లో ప్రజలు సహాయ సహకారాలు అందించేందుకు వీలుగా సిఎం ఒక స్పాన్సర్‌షిప్ పోర్టల్‌ను ప్రారంభించడం ముదావహం. స్పందించే ప్రజలు సహాయమందించడానికి, ఆ నిధుల నిర్వహణ పారదర్శకంగా ఉండడానికీ అది దోహదపడుతుంది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్‌ఐ), నేషనల్ సర్వీస్ స్కీమ్ కింద పాఠశాల, కళాశాల విద్యార్థులు సేకరించిన నిధుల వివరాలను ముఖ్యమంత్రి వెల్లడించడం మరింతమంది దాతలకు స్ఫూర్తినిస్తుంది. శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ 'రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం భవితపై బాధితులందరికీ గొప్ప ఆశను కలిగిస్తోందని' కొనియాడడం కొసమెరుపు!

మహనీయుల మాట



పోరాడితే పోయేదేమీ లేదు.
బానిస సంకెళ్లు తప్ప.

- కార్ల్ మార్క్స్

Karl Marx

సిపిఎం 24వ మహాసభ - భవిష్యత్ మార్గనిర్దేశం కోసం...

సందర్భం

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు 24వ మహాసభ మదురైలో ఏప్రిల్ రెండో తేదీ నుంచి ఆరో తేదీ వరకు జరుగనుంది. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత అంతర్జాతీయ రంగంలో వేగంగా మార్పులు వస్తున్న నేపథ్యంలో ఈ మహాసభ జరుగుతున్నది. భారత దేశంలో రాజకీయ పరిస్థితి చూస్తే బిజెపి పాలనలో నిరంకుశ హిందుత్వ కార్పొరేట్ రాజ్యం పట్టు మరింత బిగిసేలా చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నవి. కార్మిక వర్గం, రైతాంగం, శ్రామిక వర్గంలో వివిధ తరగతులు చేసిన ఉమ్మడి పోరాటం వల్ల మోడీ ప్రభుత్వంపైన, అలాగే దాని హిందూత్వ కార్పొరేట్ అనుకూల విధానాలపైన వ్యతిరేకత మరింత బలోపేతమైంది.

గత మూడు దశాబ్దాలుగా అమెరికా అధిపత్యంలో సాగుతున్న అంతర్జాతీయ క్రమాన్ని రెండు మాసాల స్వల్ప వ్యవధిలో ట్రంప్ ప్రభుత్వం తలకిందులుగా మార్చింది. 'అమెరికానే ప్రప్రథమం. అమెరికా మళ్లీ గొప్ప స్థానంలోకి' వంటి నినాదాలతో ట్రంప్ అత్యంత నగ్నంగా సామ్రాజ్యవాద దుందుడుకు దాడికి సిద్ధమైపోయాడనేది స్పష్టంగా కనిపిస్తోంది. ఇది దాని సన్నిహిత మిత్రులైన నాటో, యూరప్‌లతో అమెరికా సంబంధాలపై ప్రభావం చూపిస్తుంది. దక్షిణాఫ్రికా వంటి పేద దేశాలలో శత్రుపూరితమైన చొరబాటులను పెంచుతున్నది. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఘోరమైన మరణహోమ దాడికి వత్తాసునిస్తుంది.

ప్రకాశ్ కరత్

ఈ కారణాల వల్లనే ట్రంప్ అధ్యక్ష కాలం ఇప్పటి వరకూ స్తబ్దుగా వున్న సామ్రాజ్యవాదుల అంతర్గత ఘర్షణలతో సహా అన్ని రకాలైన ప్రధాన సామాజిక వైరుధ్యాలను తీవ్రతరం చేస్తుంది. అంతర్జాతీయ పరిస్థితిలో కనిపించే ఈ పరిణామాలను పార్టీ మహాసభ తాజాగా విశ్లేషిస్తుంది.

సుంకాలు, వీసాల విషయంలో ట్రంప్ సర్కారు భారత దేశానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోకుండా నరేంద్ర మోడీ, బిజెపి ప్రభుత్వం నిశ్చలమైన మద్దతునిస్తూనే ఉంది. అమెరికా సామ్రాజ్య వాదపు సరికొత్త దుందుడుకు పాత్రకూ భారతదేశానికి లంకె ఇక్కడే వుంది. అంతర్జాతీయంగా రూపుదాల్చిన పచ్చి మితవాద వలయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం, బిజెపి దృఢమైన స్థానమే సంపాదించుకున్నాయి. 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వం నయా ఫాసిస్టు లక్షణాలతో కూడిన ప్రగతి నిరోధక, మతవాద నిరంకుశ శక్తులు నిలదొక్కుకోడానికి కారణమైంది.

హిందుత్వ శక్తులు, బడా వర్గాల కలయికకు మోడీ ప్రభుత్వం ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ విశ్లేషణ ప్రాతిపదికగానే రాజకీయ ఎత్తుగడల పంథా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లను దాని హిందూ కార్పొరేట్ కూటమిని ఓడించటం ప్రధాన లక్ష్యంగా రూపొందింది.

రాజకీయ పంథా

24వ మహాసభ రాజకీయ తీర్మానం ముసాయిదాలో ఇచ్చిన రాజకీయ నిర్దేశం కింది కర్తవ్యాలను ముందుకు తెచ్చింది:

"2.86. బిజెపిని, హిందుత్వ శక్తులను ఒంటరిని చేసి ఓడించాలంటే హిందుత్వ భావజాలం పైన, మతోన్మాద శక్తుల కార్యకలాపాల పైన ఒక నిరంతరాయ పోరాటం అవసరం. హిందుత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగా అత్యంత విశాల ప్రాతిపదికన లౌకిక శక్తుల సమీకరణ కోసం పార్టీ కృషి చేయాలి.

2.87. హిందుత్వ నయా ఉదారవాద ప్రభుత్వంపై పోరాటాలు జయప్రదం కావాలంటే సిపిఐ(ఎం), వామపక్ష శక్తుల స్వతంత్ర శక్తి పెరగడం అవసరం. హిందుత్వ మతోన్మాదంపై పోరాటాన్ని నయా ఉదారవాద విధానాలపై పోరాటంతో సమ్మిళితం చేయవలసి ఉంటుంది.

2.88. కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా సాగే వర్గ పోరాటాలు, ప్రజా పోరాటాల ద్వారా మోడీ ప్రభుత్వానికి, బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలి. శ్రామిక ప్రజలపై దోపిడీ తీవ్రమవడానికి, వారి జీవన పరిస్థితులు, జీవనోపాధి ఘోరంగా దెబ్బ తినడానికి దారితీసిన విధానాలివే. జాతీయ వనరులు లూటీ కావడానికీ, భారీ ప్రైవేటీకరణకూ ఈ విధానాలే దారితీశాయి."

దీంతోపాటుగానే సిపిఐ(ఎం)-ప్రజాస్వామ్యంపై నిరంకుశ దాడులనూ రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బ తీసే నిరంకుశ చట్టాలకు వ్యతిరేకంగా అన్ని లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పని చేస్తుంది. ఈ దృక్పథంతో పార్టీ 'ఇండియా' వేదిక వంటి లౌకిక ప్రతిపక్ష శక్తుల విశాల వేదికలను కొనసాగించడానికి కృషి చేస్తుంది.

పార్టీ స్వతంత్ర శక్తి పెంపుదల

23వ మహాసభలో రూపొందించుకున్న రాజకీయ ఎత్తుగడల పంథా అమలుపై కేంద్ర కమిటీ రూపొందించిన రాజకీయ సమీక్ష నివేదిక పార్టీ స్వతంత్ర శక్తిని బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. అది అత్యధిక ప్రాధాన్యతాంశంగా చెప్పింది. పార్టీ మహాసభ దీన్నే ప్రధాన సమస్యగా చర్చిస్తుంది. ఎందుకంటే పార్టీ స్వతంత్ర శక్తి

> **నిర్దేశించుకున్న రాజకీయ సైద్ధాంతిక కర్తవ్యాల వెలుగులో పార్టీని వ్యవస్థాగతంగా పటిష్టం చేసుకోవడానికి, విస్తరించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ మహాసభ చర్చ జరిపి రూపకల్పన చేస్తుంది. 23వ మహాసభ కొన్ని నిర్మాణ కర్తవ్యాలను నిర్దేశించింది. పార్టీ సభ్యుల నాణ్యతను పెంచడం, శాఖలను ప్రాథమిక యూనిట్లను క్రియాశీలం చేయడం, వర్గ ప్రజా సమస్యలను చేపట్టి పోరాటాలకు నాయకత్వం వహించే విధంగా పార్టీ శాఖలను విశాల ప్రజాపంథాకు అన్వయింపచేయటం, హిందూత్వ భావజాలాన్ని-కార్యకలాపాలను తిప్పికొట్టడానికి తగిన రీతిలో సైద్ధాంతిక కృషిని చేపట్టే విధంగా పార్టీ నిర్మాణాన్ని తీర్చిదిద్దుకోవాలని ప్రత్యేకంగా నొక్కి చెప్పబడింది. ఇటువంటి వివిధ విషయాల్లో జరిగిన కృషిని నిర్మాణ నివేదికలో సమీక్షించటం జరుగుతుంది. పై స్థాయి నాయకత్వం నుంచి దిగువ స్థాయి వరకు సాధించిన అభివృద్ధి, లోపాలు ఆత్మవిమర్శనాపూరితంగా అంచనా వేయబడతాయి. రాజకీయ కృషి సమర్థంగా నిర్వహించడానికి, పోరాటాలు పెంపొందించడానికి సైద్ధాంతిక సమరం చేయడానికి వీలుగా నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవడానికి అవసరమైన భవిష్యత్ కర్తవ్యాలు నిర్ణయం అవుతాయి.**

పెరగకపోతే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులపై సమర్థవంతంగా పోరాడటం సాధ్యం కాదు.

పార్టీని బలోపేతం చేయాలంటే పునాది వర్గాలలో కృషికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రామీణ పేదలపై పల్లెల్లోని ధనాఢ్య వర్గాల దుష్ట కూటమి సాగించే దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా తీవ్ర పోరాటాలను చేపట్టాల్సి ఉంటుంది. వస్తూత్పత్తి, వ్యూహాత్మక పరిశ్రమలలోని, సంఘటిత రంగంలోని కార్మికులలో పార్టీ పలుకుబడి, పట్టు పెంచుకోవాల్సి ఉంటుంది. సంఘటిత రంగంలోని కాంట్రాక్టు కార్మికులను సంఘటిత పరచడానికి ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంటుంది.

పార్టీ రాజకీయ వేదికల చుట్టూ స్వతంత్ర రాజకీయ ప్రచారం, ప్రచార ఉద్యమాలకు, విస్తృత ప్రజా సమీకరణలపై మరింత కేంద్రీకరణ చేయవలసి ఉంటుంది. ఎన్నికల సర్దుబాట్లు లేదా కలయికల పేరుతో మన స్వతంత్ర గుర్తింపును లేదా మన స్వతంత్ర కార్యకలాపాలను మసక బారడంగా పొరపాటు పడకూడదు. ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వ శక్తుల భావజాలాన్ని తిప్పికొట్టడానికి సైద్ధాంతిక కృషికి, ప్రచారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంటుంది.

ప్రజా సమస్యలు, వర్గ సమస్యలపై స్థానిక పోరాటాలు చేపట్టడానికి చాలా ప్రాధాన్యత ఉందని నొక్కి చెప్పాల్సి ఉంది. సామాజిక కుల పీడన సమస్యలపైన, లింగ వివక్షపైన పార్టీ నేరుగా రంగంలోకి దిగి ప్రచారం, పోరాటాలు సాగించాలి. సామాజిక అణచివేతపై పోరాటాలను వర్గం వర్గ దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటాలతో అనుసంధానం చేయాలి. పార్టీలోకి యువతను పెద్ద సంఖ్యలో ఆకర్షించాలి. అందుకోసం రాజకీయ వేదిక కోర్కెలు యువతకు అన్వయించే విధంగా రూపొందించుకోవాలి.

పోరాటాలు, ప్రతిఘటనలు

2024 మే లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో పోరాటం లౌకిక, ప్రజాస్వామిక ప్రతిపక్షానికి పాక్షికంగా ప్రయోజనం కలిగించింది. బిజెపి తన మెజారిటీ కోల్పోయింది. మూడవ దఫా మోడీ ప్రభుత్వ పది నెలల పాలన అనుభవం చూస్తే హిందుత్వ కార్పొరేట్ ఎజెండా అమలులో ఎలాంటి సడలింపు ఉండబోదని స్పష్టమవుతుంది. మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు హిందుత్వ అనుకూల పోకడలపై ప్రతిఘటన మరింత విస్తృతం చేయడం, బలం చేకూర్చడం ఈ కారణంగా మరింత ముఖ్యమౌతుంది.

23వ మహాసభ తర్వాత కాలంలో కార్మిక వర్గం, రైతాంగం, మహిళలు, యువత, విద్యార్థులతో చెప్పుకోదగిన పోరాటాలు ఉమ్మడి కార్యాచరణలు జరిగాయి. తమిళనాడులోని కాంచీపురంలో 38 రోజులపాటు జరిగిన శాంసంగ్ కార్మికుల సమ్మె పోరాటం, బహుళ జాతి కంపెనీలపై విజయవంతంగా ఎలా పోరాడాలో చూపించే ఉజ్వలమైన ఉదాహరణగా ఉంటుంది. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అలాగే విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో స్కీమ్ వర్కర్లు అసంఖ్యాకమైన పోరాటాలు చేశారు. వాటి వల్ల అనేక ప్రయోజనాలు కూడా కలిగాయి. గ్రామీణ ఉపాధి పథకం-నరేగా, వేతనాలు, భూములు, ఇళ్ల పట్టాల కోసం వివిధ చోట్ల పోరాటాలు జరిగాయి.

రైతాంగ ఉమ్మడి వేదిక సంయుక్త కిసాన్ మోర్చా ఎస్.కె.యం కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని, ఇంకా ఇతర కోరికలపై పోరాటం కొనసాగిస్తూనే ఉంది. ఆదివాసులు, రైతాంగాన్ని నిర్వాసితులను చేసే గనుల తవ్వకం ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాటాలు సాగుతున్నాయి. ఆహార భద్రత, మహిళలపై అత్యాచారాలు, జాతీయ విద్యా విధానం, నిరుద్యోగం వంటి అంశాలపై మహిళలు, విద్యార్థులు, యువత రంగంలో నిలిచి పోరాడుతున్నారు.

రాబోయే రోజుల్లో నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఘటనను విస్తృతపరచాలి. తీవ్రం చేయాలి. కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్ల విధింపునకు వ్యతిరేకంగా ఇప్పటికే కేంద్ర కార్మిక సంఘాలు మే 20వ తేదీన ఒకరోజు సమ్మె కోసం పిలుపునిచ్చాయి.

ఈ పోరాటాలలో కలసి వచ్చే, వర్గ ప్రజాసంఘాలలో సభ్యులుగా చేరే జన బాహుళ్యంలో రాజకీయ చైతన్యం పెంచేందుకు పార్టీ శాఖలు మరింత శ్రద్ధ చూపించాలి. సమరశీల కార్యకర్తలు భారీ సంఖ్యలో పోరాటాలలో కలసి వచ్చి పాల్గొని రాజకీయ చైతన్యంతో పార్టీలోకి రాబట్టగలిగితేనే పార్టీ స్వతంత్ర శక్తి పెంపొందుతుంది.

అధ్యక్షుడు ట్రంప్ రూపంలోని పచ్చి దురాక్రమణ పూరిత సామ్రాజ్యవాదం దిశగా ప్రపంచం పయనిస్తున్నది. మోడీ ప్రభుత్వం దాని ప్రపంచ వ్యూహాలకు ఇష్టపూర్వకమైన నేస్తంగా వ్యవహరిస్తున్నది. ఈ కారణంగా దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని మరింతగా పెంపొందించాల్సిన అవసరం ఏర్పడుతున్నది. అమెరికా అనుకూల మోడీ విధానాలను వ్యతిరేకించాల్సి ఉంది. వామపక్షాలు మాత్రమే ఈ కర్తవ్యం నిర్వహించగలుగుతాయి.

కేరళ ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం శత్రుపూరితంగా వున్నా, వివక్షాయుతంగా వ్యవహరిస్తున్నా 'నవ కేరళ'ను పెంపొందించే ప్రత్యామ్నాయ విధానాల కోసం గట్టిగా కృషి చేయడం ద్వారా ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం ఒక ప్రత్యేక స్థానం పొందుతున్నది. సిపిఎం కేరళ శాఖ లౌకిక, ప్రజాస్వామిక ప్రత్యామ్నాయం కోసం ప్రజలను నిరంతరాయంగా సమీకరిస్తున్నది. దేశంలోని అన్ని ప్రజాస్వామిక శక్తులను మద్దతుగా కూడగట్టి ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వాన్ని రక్షించుకోవడం అవసరం.

శక్తివంతమైన పార్టీ నిర్మాణం

నిర్దేశించుకున్న రాజకీయ సైద్ధాంతిక కర్తవ్యాల వెలుగులో పార్టీని వ్యవస్థాగతంగా పటిష్టం చేసుకోవడానికి, విస్తరించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ మహాసభ చర్చ జరిపి రూపకల్పన చేస్తుంది. 23వ మహాసభ కొన్ని నిర్మాణ కర్తవ్యాలను నిర్దేశించింది. పార్టీ సభ్యుల నాణ్యతను పెంచడం, శాఖలను ప్రాథమిక యూనిట్లను క్రియాశీలం చేయడం, వర్గ ప్రజా సమస్యలను చేపట్టి పోరాటాలకు నాయకత్వం వహించే విధంగా పార్టీ శాఖలను విశాల ప్రజాపంథాకు అన్వయింప చేయటం, హిందూత్వ భావజాలాన్ని కార్యకలాపాలను తిప్పికొట్టడానికి తగిన రీతిలో సైద్ధాంతిక కృషిని చేపట్టే విధంగా పార్టీ నిర్మాణాన్ని తీర్చిదిద్దుకోవాలని ప్రత్యేకంగా నొక్కి చెప్పబడింది. ఇటువంటి వివిధ విషయాల్లో జరిగిన కృషిని నిర్మాణ నివేదికలో సమీక్షించటం జరుగుతుంది. పై స్థాయి నాయకత్వం నుంచి దిగువ స్థాయి వరకు సాధించిన అభివృద్ధి, లోపాలు ఆత్మవిమర్శనాపూరితంగా అంచనా వేయబడతాయి. రాజకీయ కృషి సమర్థంగా నిర్వహించడానికి, పోరాటాలు పెంపొందించడానికి సైద్ధాంతిక సమరం చేయడానికి వీలుగా నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవడానికి అవసరమైన భవిష్యత్ కర్తవ్యాలు నిర్ణయం అవుతాయి.

సిపిఐ(ఎం)ను బలోపేతం చేయడంతో పాటుగానే వామపక్ష శక్తుల ఐక్యతను రూపొందించడం వామపక్ష ప్రజాస్వామిక ప్రత్యామ్నాయాన్ని రూపొందించడం దిశగా నడవాల్సి ఉంటుంది. వామపక్ష ప్రజాస్వామిక వేదికను చాలా ఓపికతో నిర్మించాల్సి ఉంటుంది. అందులో అన్ని తరగతుల వర్గాల శ్రామిక ప్రజలనూ, వారికి ప్రాతినిధ్యం వహించే సంఘాలనూ కూడగట్టవలసి ఉంటుంది.

24వ మహాసభ సమస్త వామపక్ష ప్రజాస్వామిక లౌకిక శక్తులు సమీకృతమై చేసే ఒక వేదికగా రూపొందాలి. అభివృద్ధి నిరోధకులైన చీకటి శక్తులను వెనక్కు కొట్టే పోరాటానికి సిద్ధం కావాలి. లౌకిక ప్రజాస్వామ్య ప్రగతిశీల మార్గంలో ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గానికి శ్రీకారం చుట్టాలి.

/వ్యాసకర్త సిపిఐ(ఎం) సమన్వయకర్త/

★

విదేశీ దిగుమతులు - నష్టాల్లో కోకో రైతులు

సమస్య

మన రాష్ట్రంలో 75 వేల ఎకరాలలో కోకో తోటల సాగు ఉంది. ఏలూరు జిల్లాతో పాటు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో కోకో అంతర పంటగా ఉంది. మన దేశ అవసరాలకు తగిన విధంగా ఇక్కడ ఉత్పత్తి లేదు. 80 శాతం కోకో ను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాం. కోకో ను చాక్లెట్లు, కేకులు, వివిధ ఆహార పదార్థాల తయారీలో ఉపయోగిస్తున్నారు.

కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. మన రాష్ట్రంలో మోండలీజ్ (క్యాడ్బరీ) ప్రధాన కొనుగోలు కంపెనీగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇస్తున్నామని కంపెనీలు చెబుతున్నాయి. గత సంవత్సరం కంపెనీలు పోటీ పడి అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కిలో గింజలను రూ.1040 వరకు కొనుగోలు చేశారు. గత సంవత్సరం రైతుకు కిలో కోకో గింజలకు సరాసరి ధర రూ.749 వచ్చింది. రాష్ట్రంలో 1992 నుండి కోకో తోటల సాగు ఉన్నా ఈ విధంగా ధర వచ్చిన సందర్భాలు లేవు. ఎన్నో కష్టనష్టాలకోర్చి రైతులు కోకో గింజలు ఉత్పత్తి చేస్తున్నారు. ఈ సంవత్సరం కంపెనీలు సిండికేట్‌గా మారి అంతర్జాతీయ ధర ఇవ్వడం లేదు. పైగా అన్‌సీజన్ (వర్షాకాలపు) గింజలు కొనుగోలు చేయడం లేదు. సీజన్ కోకో గింజలు ధర రోజురోజుకీ తగ్గించి వేస్తున్నారు. కంపెనీలు ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంది. కంపెనీలను ఏమీ చేయలేం అన్నట్లుగా ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతున్నారు.



కె. శ్రీనివాస్

కంపెనీలు రైతులను ఇబ్బందులు పెట్టే ధోరణితోనే ఉన్నాయి. పాత గింజల కొనుగోలుపై కంపెనీలు స్పష్టత ఇవ్వడం లేదు. కంపెనీలు మాత్రం అన్‌సీజన్ గింజలు కొనలేమని, నాణ్యత లేదని బుకాయిస్తూ రోజురోజుకీ ధర తగ్గించి వేస్తున్నాయి. అధికారులు, ప్రభుత్వం కూడా కంపెనీలు కొనాలని గట్టిగా చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవేళ చెప్పినా కంపెనీలు మాత్రం తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇంతక ముందు లేని గ్రేడింగ్ విధానాన్ని ముందుకు తీసుకువచ్చారు. నాణ్యతా ప్రమాణాలు గురించి మాట్లాడుతున్నారు. కంపెనీలు కొత్త గింజలు కొంటామని పాత గింజలు కొనలేమని చెప్పడం అన్యాయం. కొత్త గింజలు రూ.650 నుండి రూ.600కు ఇప్పుడు రూ.550కు, రూ.500కు ధర తగ్గించారు. ఈ ధర మరింత తగ్గిస్తామని కంపెనీలు రైతులను బెదిరిస్తున్నాయి. అన్‌సీజన్ గింజలను రూ.200 నుండి రూ.240కు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ కొనుగోలు కూడా నామ మాత్రమే. అక్కడక్కడ కొనుగోలు చేసినా చాలా తక్కువ ధర ఇస్తున్నాయి. రైతులు గత్యంతరం లేక అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

> **ధరల స్థిరీకరణ నిధి పథకం గురించి ప్రభుత్వాలు గొప్పగా చెబుతున్నాయి. ఆచరణలో అమలు లేదు. ప్రస్తుతం కంపెనీలు ఇస్తున్న ధర వల్ల రైతులు నష్టపోతున్నారు కాబట్టి వ్యత్యాసపు ధరను ప్రభుత్వాలు చెల్లించాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత. విదేశీ కోకో గింజల దిగుమతుల నిలుపుదలకు కేంద్రంపై రాష్ట్రం ఒత్తిడి తేవాలి. రాష్ట్రంలో ఎక్కడా కోకో ప్రాసెసింగ్ యూనిట్లు లేవు. వీటిని ఏర్పాటుచేసి రైతుకు మంచి ధర వచ్చేలా ప్రభుత్వాలు శాశ్వత చర్యలు చేపట్టాలి.**

సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇటీవల ఎరువులు, పురుగు మందులు ధరలు పెరిగాయి. కోకో గింజల ధర పెరిగిన తర్వాత కౌలు రేట్లు పెరిగాయి. ప్రస్తుతం ఎకరా కోకో తోటలకు రూ. లక్ష నుండి రూ.లక్ష 50 వేల వరకు కౌలు ఉంది. ఎకరాకు ఎరువులు, పురుగు మందులు, కూలీ ఖర్చులు రూ. 60 వేల వరకు ఖర్చు అవుతున్నాయి. కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం తగినంతగా జోక్యం చేసుకోకపోతే కోకో రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతారు.

ఎగుమతులు దిగుమతులు విధానం వలన కోకో రైతులు నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం వైపు నుండి తగిన జోక్యం లేదు. విదేశీ కోకో గింజల దిగుమతుల నిలుపుదలకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా దేశీయంగా రైతు నష్టపోవాల్సి వస్తోంది. ధర గురించి అడిగితే అధికారులు సప్లై-డిమాండ్ సూత్రం చెబుతున్నారు. 80 శాతం కోకోను దిగుమతి చేసుకుంటున్న మనదేశంలో సప్లై ఉన్నట్లా లేనట్లా? డిమాండ్ ఉన్నది గానీ సప్లై లేదు. మరి ఈ పరిస్థితుల్లో కోకో రైతుకు మెరుగైన ధర రావాల్సిన అవసరం ఉంది. ఎందుకు రావడం లేదో సమాధానం లేదు. గత సంవత్సరం ఘనాలో పంట దెబ్బతిని దిగుబడులు లేవు కాబట్టి అంతర్జాతీయంగా కోకోకు డిమాండ్ పెరిగింది. ఈ సంవత్సరం ఆఫ్రికన్ దేశాల్లో దిగుబడులు పెరిగాయి కాబట్టి ధర తగ్గిందని చెప్తున్నారు. అయినా ప్రస్తుతం కిలో కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర రూ.700 వరకు ఉంది. ఈ ధర రైతుకు రావడం లేదు. పైగా కంపెనీలు రైతుల నుండి గింజలు కొనుగోలు చేయడం లేదు. తమ దగ్గరున్న కోకో గింజలను వెంటనే కొనుగోలు చేయకపోతే కోకో రైతులు ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు. ఇప్పటికే రైతుల ఆత్మహత్యలలో మన రాష్ట్రం దేశంలో మూడవ స్థానంలో ఉంది. కోకో రైతులను ఈ సంక్షోభం నుండి బయటపడేలా ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు చేపట్టకపోతే కోకో గింజల కొనుగోలు సమస్య మరింత తీవ్రమవుతుంది. సీజన్ గింజలు రైతు చేతికి వస్తున్నాయి. రైతు వద్ద మరింత నిల్వలు పెరిగితే కంపెనీలు కొనుగోలు చేయకపోతే మరింత నష్టపోతారు.

ధరల స్థిరీకరణ నిధి పథకం గురించి ప్రభుత్వాలు గొప్పగా చెబుతున్నాయి. ఆచరణలో అమలు లేదు. ప్రస్తుతం కంపెనీలు ఇస్తున్న ధర వల్ల రైతులు నష్టపోతున్నారు కాబట్టి వ్యత్యాసపు ధరను ప్రభుత్వాలు చెల్లించాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత. విదేశీ కోకో గింజల దిగుమతుల నిలుపుదలకు కేంద్రంపై రాష్ట్రం ఒత్తిడి తేవాలి. రాష్ట్రంలో ఎక్కడా కోకో ప్రాసెసింగ్ యూనిట్లు లేవు. వీటిని ఏర్పాటుచేసి రైతుకు మంచి ధర వచ్చేలా ప్రభుత్వాలు శాశ్వత చర్యలు చేపట్టాలి.

రాష్ట్రంలో కొబ్బరి పంటలోనే కాకుండా ఆయిల్ పామ్ అంతర పంటగా కోకోని అభివృద్ధి చేసేందుకు చాలా అవకాశాలు ఉన్నాయి. అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉన్న కోకో పంట సాగు విస్తీర్ణం పెంచడమే కాకుండా మంచి దిగుబడి, ధర వచ్చే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. కోకో కు బోర్డు ఏర్పాటు చేసి వేలం ద్వారా కోకో గింజలు కొనుగోలు చేసే విధంగానైనా రైతులతో సంప్రదించి ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి. ఈ పరిస్థితుల్లో తమ సమస్యల పరిష్కారం కోసం కోకో రైతులు సంఘటితం కావడం తప్ప మరో మార్గం లేదు.

/వ్యాసకర్త ఎ.పి కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
సెల్:94900 98574/

కవిత్వం

ఉగాది ముచ్చట!

ఉగాది ముచ్చట చూద్దామని
ఉవ్విళ్ళూరాను.. ఊరెళ్ళాను
మామిడి పూత..వేప పువ్వు
అరటి గెల..చెరుకు గడ
కోకిల పాట..నాగలి నడక
ఊహిస్తూ ఉరుకున పోయాను
కుండల కొద్దీ మంచు కురిసి
మామిడి పూత రాలింది
వడగండ్ల వాన విరుచుకుపడి
అరటి గెల నేలకొరిగింది
మంటలు రేపే వేసవి వేడికి
చెరుకు మాడి, వంట చెరుకైంది
సాగు సజావుగా సాగని బతుకులో
నాగలి నడక మరిచింది
గాలి నిండా కాలుష్యంతో
గండు కోకిల గొంతు మండింది.
అవును,
నాకిప్పుడు ఉగాదులు లేవు
చేజేతులా తెచ్చుకున్న శిశిరాలే.
వసంతాల వర్ణనలు
ఇప్పుడు అభూత కల్పనలే!

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

జియోహాట్‌స్టార్‌కు 10 కోట్ల చందాదారులు

న్యూఢిల్లీ : ప్రముఖ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ జియోహాట్‌స్టార్ 10 కోట్ల చందాదారుల మైలురాయిని అధిగమించినట్లు ప్రకటించింది. దేశంలోని విభిన్న ప్రేక్షకులను అర్థం చేసుకోవడంలో తమ సంస్థ అచంచలమైన నిబద్ధతకు ఇది అద్భుత నిదర్శనమని జియోహాట్‌స్టార్ డిజిటల్ సిఇఒ కిరణ్ మణి పేర్కొన్నారు. ఈ మైలురాయి భారతదేశ సామర్థ్యాన్ని నొక్కి చెప్పడమే కాకుండా, అపూర్వమైన స్థాయిలో కేటగిరీ ఫస్ట్ అనుభవాలను అందించాలనే తమ నిబద్ధతను మరింతగా వెల్లడిస్తోందన్నారు.

కేంద్రం నుండి విదిలింపులే!

- అంచనాల మేరకు అందని నిధులు
- కాగ్ తాజా గణాంకాల్లో వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పెద్ద ఎత్తున సహకరిస్తోందంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రులతో పాటు, టిడిపి కూటమి నేతలు చేసే ప్రకటనలు ఎలా ఉన్నప్పటికీ, వాస్తవం దానికి భిన్నంగా ఉంది. సాక్షాత్తు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం కేంద్రం నుండి కేవలం విదిలింపులు మాత్రమే రాష్ట్రానికి దక్కుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఫిబ్రవరి నెల వరకు గణాంకాలను కాగ్ తాజాగా విడుదల చేసింది. కాగ్ విశ్లేషణ ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పథకాలు, కార్యక్రమాల నిర్వహణ కోసం 30,333 కోట్ల రూపాయలు కేంద్రం నుండి వస్తాయని రాష్ట్రం అంచనా వేసింది. అయితే,11 నెల్లలో కేవలం 12,832 కోట్ల రూపాయలు మాత్రమే వచ్చినట్లు కాగ్ తేల్చింది. అంటే అంచనా వేసిన మొత్తంలో సగం కూడా రాని పరిస్థితి. నెలకు 1,166 కోట్ల రూపాయలు వచ్చినట్లు కాగ్ నిర్ధారించింది, దీని ప్రకారం చివరి నెలలో 17 వేల కోట్ల రూపాయలకు పైగా వస్తేనే అంచనా మేరకు నిధులు వచ్చినట్లు అవుతుంది. ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం మార్చి నెలలో కూడా కేంద్రం నుండి నిధులు ఆశించిన విధంగా లేవు. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రాష్ట్రానికి మొండి చేయి చూపించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు రుణభారం పెరుగుతోంది. బడ్జెట్లో రూ.68 వేల కోట్ల వరకు రుణాలు తీసుకుంటామని ప్రతిపాదించగా, 11 నెలల కాలంలోనే 90 వేల కోట్ల రూపాయలను దాటిపోయింది. దీంతో లోటు కూడా అదే స్థాయికి చేరిపోయింది. తాజా గణాంకాల ప్రకారం 219 శాతం ఆదాయ లోటు నమోదుకాగా, ద్రవ్యలోటు 131 శాతం వరకు చేరిపోయింది.ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం 2.69 లక్షల కోట్ల రూపాయలు వస్తాయని అంచనా వేయగా, 11 నెల్లలో రుణాలతో కలిపి2.32 లక్షల కోట్ల రూపాయలు వచ్చినట్లు తేలింది. జిఎస్టి ద్వారా 84 శాతం, స్టాంపులు రిజిస్ట్రేషన్ల ద్వారా 58 శాతం, సేల్స్‌టాక్స్ ద్వారా 64 శాతం, స్టేట్ ఎక్సయిజ్ ద్వారా 66 శాతం మాత్రమే ఆదాయం రావడం విశేషం.

ఇవీ గణాంకాలు (రూ. కోట్లలో)

విభాగం	అంచనాలు	వచ్చినమొత్తం
మొత్తం ఆదాయం	2,69,546	2,31,947
సొంత పన్నులు	1,60,264	1,24,046
కేంద్ర గ్రాంట్లు	30,334	12,832
స్టాంప్స్ రిజిస్ట్రేషన్లు	13,500	7,919
ల్యాండ్ రెవెన్యూ	58	195
సేల్స్ టాక్స్	24,500	15,793
పన్నుల్లో వాటా	35,395	33,199
ఇతర పన్నులు	8,645	5,740
నాన్ టాక్స్	10,576	4,492
రుణాలు	68,360	90,558
మొత్తం వ్యయం	**2,68,630**	**2,30,966**
రెవెన్యూ వ్యయం	**2,35,917**	**2,17,663**
పెట్టుబడి వ్యయం	**32,713**	**13,304**

బకాయిలు చెల్లించకపోతే ఆత్మహత్యలే శరణ్యం

- ఏపి బిల్డింగ్ అండ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

తమ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ (సబ్కా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.విజయ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించని కారణంగా ఇప్పటికే ముగ్గురు కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ లబ్బీపేటలోని అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య ప్రతినిధుల సమావేశం శుక్రవారం జరిగింది. అనంతరం విజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరం రెండు రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో తమ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు బకాయిల విడుదల కోసం లేఖ కూడా రాసిందని తెలిపారు. గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయల మేర బిల్లులు పెండింగ్‌లో పెట్టిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ కష్టాలు తీరుతాయని, బిల్లులు సకాలంలో చెల్లిస్తారని నమ్మకంతో ప్రభుత్వానికి తామంతా అండగా నిలబడ్డామని తెలిపారు. ఎంఎస్ఎంఇ కేటగిరీ కాంట్రాక్టర్లు కూడా రాష్ట్రాభివృద్ధికి వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టారన్నారు. ఈ నేపథ్యంలో టిడిపి కూటమి ప్రభుత్వం తమ బకాయిలను చెల్లించాలని కోరారు. ఈ ఏడాది జనవరిలో ఆర్థిక ఒత్తిడితో బి జనార్ధన్ రెడ్డి, పి మల్లికార్జున ప్రసాద్, ఎస్ చాంద్ భాష అనే ముగ్గురు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాష్, అసోసియేషన్ సభ్యులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.విజయ్‌కుమార్

IN THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Gr. & 1st Floor, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-20

OA 130/2025

Bank of Maharashtra, Vijayawada Branch, Rep. by its Chief Manager ....Applicant
Versus
1. M/s. Sri Sai Aqua Traders; rep. by its proprietor, Mr. Vatsavai Sai Venkata Subramanyam Varma
2. Mr. Vatsavai Sai Venkata Subramanyam Varma
3. Mr. Vatsavai Srinivasa Raju ....Defendants

To:
D1 : M/s. Sri Sai Aqua Traders; Rep. by its Prop: Mr. Vatsavai Sai Venkata Subramanyam Varma, S/o. Late Krishnam Raju, Aged 25 years, D.No.19-5-1, School Street, Kamsalipeta, Vijayawada, NTR District, A.P-520001; Ph. No.8978099725.
D2 : Mr. Vatsavai Sai Venkata Subramanyam Varma, S/o. Late Krishnam Raju, Aged 25 years, D. No.19-5-1, School Street, Kamsalipeta, Vijayawada, NTR District, A.P-520001; Ph. No.8978099725

SUBSTITUTE SERVICE OF SUMMONS BYWAY OF PAPER PUBLICATION

1. Whereas the applicant has instituted the above application u/s 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act., 1993 against you for the recovery of a sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10:30 a.m. or at such time immediately thereafter according to the convenience of Tribunal on **11-04-2025** to answer the claim.
2. A copy of the application and annexure are to be collected on your appearance before the Tribunal.
3. If you intended to file any documents, you file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed.
5. Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the **10th day of March, 2025**

Signature of the officer
Authorized to issue summons

टाटा కాపిటల్ / TATA
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్కు, గణపత్రావ్ కదం మార్గ్, లోవర్ ప్యారెల్, ముంబయి 400013 సిఐఎన్ నం: U67190MH2008PLC187552, సంప్రదించాల్సిన నెం.(022) 61827414, (002) 61827375.

స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

ఏదైతే, దిగువసంతకందారు **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీతలను సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరడమైనది.
రుణగ్రహీత, మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజలకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువసంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ పేర్కొన్న చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది.
ప్రత్యేకించి రుణగ్రహీత, మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి దిగువ పేర్కొన్న మొత్తాలను మరియు డిమాండ్ నోటీసు తేది నుండి దానిపై వడ్డీ మరియు ఫైనల్ వడ్డీ, చార్జీలు, ఖర్చులు మొ॥వాటిని చెల్లించుటకు లోబడి ఉంటుంది.
రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

క్ర సం.	లోన్ అకౌంట్ నం.	అబ్లిగర్స్/చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధుల పేరు	మొత్తం మరియు డిమాండ్ నోటీసు తేది	స్వాధీనతా తేది
1	9910512.	శ్రీ. ముసునూరు వంశీకృష్ణ రుణగ్రహీత మరియు శరశ్చంద్రిక గ్రూప్ మరియు శ్రీమతి. దోనేపుడి స్వప్న (సహ-రుణగ్రహీత)	13.01.2025 నాటికి రూ॥1,10,75,316/- (ఒక కోటి పది లక్షల డెబ్బై ఐదు వేల మూడు వందల పదహారు రూపాయలు మాత్రమే)	25 మార్చి, 2025

సెక్యూర్డ్ అసెట్స్/ స్థిరాస్తుల వివరణ : గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రీ, తూళ్లూరు మండలం, రాయపుడి గ్రామ పంచాయతీ ఏరియా, రాయపుడి గ్రామం వద్ద శ్రీ.ముసునూరు వంశీకృష్ణ పేరు మీద ఉన్న వైడ్ సెటిల్‌మెంట్ డీడ్ నం.12105/2016 మూల్యాంకనం నం.266, డో.నం.3-50/1, డో.నం.304లో ఉన్న రెసిడెన్షియల్ సైట్ విస్తీర్ణం 881.66 చ.గ.లు. లేదా 737.16 చ.మీ.లు. తో అందులో నిర్మాణాలు మరియు అన్నీ సౌలభ్య హక్కులతో అనుబంధ ఫిక్చర్లు. మరియు క్రింది విధమైన సరిహద్దులు : తూర్పు : సర్కార్ బజారు 165.0, దక్షిణం : మల్లెల మల్లికార్జునరావు ఆస్తి 30.0, పడమర : సర్కార్ బజారు 180.0, ఉత్తరం : ఇతరుల ఆస్తి 62.
ఈ సరిహద్దుల సైట్ పరిధి 881.66 చ.గ.లు. లేదా 737.16 చ.మీ.లు. తో బంగల పెంకు ఇంటితో ప్లింత్ ఏరియా 960 చ.అ.లు.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
తేది : 29.03.2025
సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

UGRO CAPITAL
యూ గ్రో క్యాపిటల్ లిమిటెడ్
4వ అంతస్తు, టవర్ 3, ఈక్వినాక్స్ బిజినెస్ పార్క్, ఎల్‌బిఎస్ రోడ్డు, కుర్లా, ముంబై-400070

అనుబంధం 4 (రూల్ 8(1) చూడండి) (స్థిరాస్తి కొరకు) స్వాధీనతా నోటీసు

దిగువసంతకందారు అయిన **యూ గ్రో క్యాపిటల్ లిమిటెడ్**, ఉన్న నమోదిత కార్యాలయం : 4వ అంతస్తు, టవర్ 3, ఇక్వినాక్స్ బిజినెస్ పార్క్, ఎల్‌బిఎస్ రోడ్డు, కుర్లా, ముంబై-400070 యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూర్డ్ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) యొక్క సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, యొక్క రూల్ 3 తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అతనికి ఇవ్వబడిన అధికారాలను వినియోగిస్తూ పేర్కొన్న నోటీసు రసీదు తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని దానిపై వడ్డీతో తిరిగి చెల్లించాలని రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనందున, రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (4) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద వివరించిన ఆస్తిని దిగువసంతకందారు స్వాధీనపరచుకోవడమైనది.
ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు **యూ గ్రో క్యాపిటల్ లిమిటెడ్**కు మొత్తాన్ని దానిపై వడ్డీతో సహా చెల్లించి జరుపవచ్చు. రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

క్ర సం.	రుణగ్రహీత వివరాలు	డిమాండ్ నోటీసు	తనఖా ఆస్తి	స్వాధీనతా తేది
1	1. అంబిక డీజిల్ వర్క్, 2. నాదకుడిటి రామరాజు, 3. నడకుడిటి సుభాషిణి లోన్ అకౌంట్ నంబరు : UGVJYSS0000004744	డిమాండ్ నోటీసు తేది : 09.01.2025 మొత్తం రూ. 1,85,83,792.00/- (ఒక కోటి ఎనభై ఐదు లక్షల ఎనభై మూడు వేల ఏడు వందల తొంభై రెండు రూపాయలు మాత్రమే) 09.01.2025 నాటికి	ఆంధ్రప్రదేశ్, ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ-520012, విజయవాడ జిల్లా రిజిస్ట్రారర్ కార్యాలయం అధికార పరిధిలోని విద్యాధరపురం వద్ద ఉన్న డో.నం.1-1/1-69, మూల్యాంకనం నం.1073241953, మున్సిపల్ వార్డు నం.29, బేరింగ్ విద్యాధరపురం ఆర్.ఎస్.నం.8/3బి, ఖాళీ సైట్ తో పాటు స్థిరాస్తి మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ బేరింగ్ కొలత 844 చ.గ.లు. **ఉన్న హద్దులు : ఉత్తరం :** పి.మాధవరావు ఆస్తి, **దక్షిణం :** ఇతరులకు అమ్మబడిన మహ్మద్ షరీఫ్, **తూర్పు :** మున్సిపల్ రోడ్డు, **పడమర :** డొంక రోడ్డు.	25-03-2025

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్ (విజయవాడ)
తేది : 29.03.2025
సం/-(అధీకృత అధికారి)
యూగ్రో క్యాపిటల్ లిమిటెడ్

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏపీ - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : ఋణగ్రహీతలు : 1) మెస్సర్స్ సన్‌రైజ్ ఏజెన్సీస్, శ్రీ సిరిగిరి నరసింహారావు (మేనేజింగ్ పార్టనర్) మానస అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్, వెంకటేశ్వరపురం, విజయవాడ - 10. **2) శ్రీ బసుదే శ్రీకాంత్,** (పార్టనర్) డి.నెం. 13-6-460/66, మహేష్ నగర్ కాలనీ, శివ్‌బాగ్, మహబూబ్‌నగర్, తెలంగాణ - 509210. **డైరెక్టర్ & హామీదారు : శ్రీ సిరిగిరి నరసింహారావు** (ప్రొప్రయిటర్) మనస అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థ నగర్, వేంకటేశ్వరపురం, విజయవాడ -10
విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి మెస్సర్స్ సన్‌రైజ్ ఏజెన్సీస్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.
చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 15-04-2021** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.
పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 13-09-2021** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.
ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచ్ కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.
మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.
విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి పక్రియ కొనసాగిస్తుంది.
ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 15-04-2021** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు ఇక్కడ వివరించబడ్డాయి :
శ్రీ సిరిగిరి నరసింహారావు, తండ్రి : అశోక్ గారి పేరిట విజయవాడ, కృష్ణలంక, ఆనంద భవన్ రోడ్డుకి దక్షిణం వైపు చివర, దేవి గుడి దగ్గర, డి.నెం. 41-26/1-22/1 వద్ద 103.00 చ॥గ॥ల విస్తీర్ణంలో నిర్మించిన జి+1 రెసిడెన్షియల్ బిల్డింగ్. **హద్దులు : తూర్పు :** చాట్ల ధనలక్ష్మి గారి ఇల్లు, **దక్షిణం :** కొంగర జగన్‌మోహనరావు గారి ఆస్తి, **పడమర :** మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం :** శొంఠి ప్రకాశరావు గారి ఆస్తి.

తేది : 24-03-2025
ప్రదేశం : విజయవాడ
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము
ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్-హైదరాబాద్, 1వ అంతస్తు, ప్లాట్ నెం: 94, సాగర్ సొసైటీ,రోడ్ నెం.2, బంజారా హిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ, ఫోన్ నం. 040-29550553, ఇ-మెయిల్: E-Mail: hyd@nhai.org

బహిరంగ ప్రకటన

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్.హెచ్.65లో కి.మీ. 40.000 నుండి కి.మీ. 221.500 వరకు హైదరాబాద్ - విజయవాడ వరకు గల సెక్షన్ కోసం కి.మీ. 205.025 వద్ద గల చిల్లకల్లు టోల్ ప్లాజాలో యూజర్ ఫీజ్ ధరలు 01-04-2025 నుండి వర్తింపుతో అమలులోకి వస్తాయి.

వాహనాల రకము	ఒకవైపు ప్రయాణానికి రుసుము (రూ.లలో)	ఒకరోజు లోపు తిరుగు ప్రయాణానికి రుసుము (రూ.లలో)	ఒక నెలలో 50 ఒకవైపు (సింగిల్) ప్రయాణాలకు నెలవారీ పాస్ కొరకు రుసుము (రూ.లలో)	ఫీజు ప్లాజా ఉన్న జిల్లాలో రిజిస్టరైన వాణిజ్య వాహనాల కొరకు ఒకవైపు ప్రయాణానికి రుసుము (రూ.లలో)
కారు, జీపు, వ్యాన్ లేదా తేలికపాటి మోటరు వాహనం	105	155	3430	50
తేలికపాటి వాణిజ్య వాహనం, తేలికపాటి సరుకుల వాహనం లేదా మినీ బస్సు	165	250	5540	85
బస్సు లేదా ట్రక్కు(2 ఇరుసులు)	350	520	11605	175
మూడు - ఇరుసులు వాణిజ్య వాహనాలు	380	570	12660	190
HCM లేదా EME లేదా MAV (నాలుగు నుండి ఆరు ఇరుసులు)	545	820	18195	275
భారీ వాహనాలు (ఏడు లేదా అంతకన్నా ఎక్కువ ఇరుసులు)	665	995	22150	330

2025-26 ఆర్థిక సంవత్సరానికి పై టోల్ ప్లాజా నుండి 20 కి.మీ. దూరం లోపల నివసించే స్థానిక వాణిజ్యేతర వాహనాల కోసం నెలవారీ పాస్ రేటు రూ.350/-
సం/- ప్రాజెక్ట్ డైరెక్టర్, NHAI,PIU-(హైదరాబాద్)

GRIHUM HOUSING FINANCE Apna Ghar. Apni Pehchan.
గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)
నమోదిత కార్యాలయం: 6వ అంతస్తు, బి- బిల్డింగ్, గంగా ట్ర్యూనో బిజినెస్ పార్క్, లోహెగాన్, పూణె-411014.
అనుబంధం IV [రూల్ 8(1) చూచుట] **స్వాధీనత నోటీసు (స్థిరాస్తి కొరకు)**

ఏదైతే, దిగువసంతకందారు అయిన **గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడిన పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ 17 నవంబర్, 2023 నుండి గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడింది) (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది మరియు వాస్తవంలో జి ఇ మనీ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ అన్‌లిమిటెడ్ కంపెనీ తో విలీనం చేయబడింది)** సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "సదరు చట్టం"గా సూచించబడుతుంది) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద అధికారాలు అధ్యాయనం చేస్తూ, పైన కార్పోరేట్/రిజిస్టర్ కార్యాలయం యొక్క ఇకపై సెక్యూర్ క్రెడిటార్‌గా సూచించబడే ఆధీకృత అధికారి సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు దిగువ రుణగ్రహీతలను పిలుస్తూ దిగువ తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తిని 23 జనవరి, 2024న దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైనదని రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీని సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క చార్జ్‌కు లోబడి జరుపవలెను.
సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలు అహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించవలెను. స్వాధీనత తీసుకున్న ఆస్థి వివరాలు దిగువన ఇవ్వబడినాయి:

క్ర. సం	రుణగ్రహీతల పేరు	ఆస్తి వివరణ	స్వాధీనం తీసుకున్న తేది	డిమాండ్ నోటీసు చట్టబద్ధత తేది	డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)
ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచ్ కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి పక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 01-09-2022** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు ఇక్కడ వివరించబడ్డాయి :
1. శ్రీ బండ్ల సురేష్‌బాబు గారి పేరిట ఎపి., గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా పరిధి, గోరంట్ల గ్రామ పంచాయితీ, గోరంట్ల గ్రామం ఆర్.ఎస్.నెం. 31. గుంటూరు తహసీల్దారు ఆర్‌సి నెం. 1080/2016, ఎండార్స్‌మెంట్ తేది : 05-11-2016, అది ఎఫ్‌యంబి భూమి గోరంట్ల గ్రామం ఆర్.ఎస్.నెం. 31-సి, సమీప డి.నెం. 6-202/3, రాజ్ కమల్ అపార్ట్‌మెంట్ ఎదురుగా, సరస్వతి విద్యాలయం రోడ్డు, గుంటూరు, గుంటూరు జిల్లా, ఎపి వద్ద 879.66 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** సరస్వతి విద్యాలయంకి చెందిన కాంపౌండ్ వాల్, **పడమర :** 33 అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** బండ్ల వెంకటేశ్ గారికి చెందిన ఆస్తి, **దక్షిణం :** శ్రీ బండ్ల గోపి గారికి చెందిన ఆస్తి. (రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్ నెం. 5805/2014, తేది : 15-07-2014. శ్రీ బండ్ల సురేష్ బాబు కి అనుకూలంగా శ్రీ బండ్ల నరసింహారావు చేత అమలు చేయబడింది.)

తేది : 24-03-2025 **ప్రదేశం : విజయవాడ**
అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏపీ - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : ఋణగ్రహీతలు : 1 (ఎ) మెస్సర్స్ విజయలక్ష్మి కాటన్ ట్రేడర్స్, కేరాఫ్ : మెస్సర్స్ ఓంకార్‌నాథ్ కాటన్ జిన్నింగ్ మిల్, కేరాఫ్ రాయపాటి వీరయ్య జిన్నింగ్ మిల్, నగరాలు దగ్గర, అమరావతి రోడ్డు, గుంటూరు, ఎపి. **1(బి) శ్రీ రావు రామయ్య,** తండ్రి : నరసింహారావు, (ప్రొప్రయిటర్) డోర్ నెం. 7-142, మెయిన్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్, ఎపి. - 522034. **సహ-ఋణగ్రహీత / హామీదారు : 2 (ఎ) శ్రీ బండ్ల వెంకటేష్,** తండ్రి : నరసింహారావు (హామీదారు), డి.నెం. 130-5-177, రెవిన్యూ వార్డు నెం. 57, హెచ్‌పి పెట్రోల్ బంక్ ప్రక్కన, 5వ లైన్, అన్నపూర్ణనగర్, గోరంట్ల, గుంటూరు, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్, ఎపి - 522034.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి మెస్సర్స్ విజయలక్ష్మి కాటన్ ట్రేడర్స్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.**

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 30-06-2021** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 26-04-2022** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచ్ కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి పక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 30-06-2021** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు ఇక్కడ వివరించబడ్డాయి :
శ్రీ బండ్ల వెంకటేష్ గారి పేరిట ఎపి., గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా పరిధి, గోరంట్ల గ్రామ పంచాయితీ, గోరంట్ల గ్రామం ఆర్.ఎస్.నెం. 31. గుంటూరు తహసీల్దారు ఆర్‌సి నెం. 1080/2016, ఎండార్స్‌మెంట్ తేది : 05-11-2016, అది ఎఫ్‌యంబి భూమి గోరంట్ల గ్రామం ఆర్.ఎస్.నెం. 31-సి, సమీప డి.నెం. 6-202/3, రాజ్ కమల్ అపార్ట్‌మెంట్ ఎదురుగా, సరస్వతి విద్యాలయం రోడ్డు, గుంటూరు, గుంటూరు జిల్లా, ఎపి వద్ద 874.83 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** సరస్వతి విద్యాలయంకి చెందిన ఆస్తి, **పడమర :** 33 అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** గుడి ట్రస్ట్‌కి చెందిన ఆస్తి, **దక్షిణం :** శ్రీ బండ్ల సురేష్ బాబు గారికి చెందిన ఆస్తి. (రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్ నెం. 5806/2014, తేది : 15-07-2014. శ్రీ బండ్ల వెంకటేష్ కి అనుకూలంగా శ్రీ బండ్ల నరసింహారావు చేత అమలు చేయబడింది.)

తేది : 24-03-2025 **ప్రదేశం : విజయవాడ**
అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పృథ్వీ ప్రళయం

వరుస భూకంపాలతో మరుభూమిగా మయన్మార్

- థాయిలాండ్‌లోనూ పెను విధ్వంసం • 200 మందికి పైగా మృతి
- వేయి పడకల ఆసుపత్రి సహా పేకమేడల్లా కూలిన భవనాలు
- శిథిలాల కింద చిక్కిన వారెందరో!

నెపిడా, బ్యాంకాక్ : నేలతల్లి ప్రకోపించింది. నిమిషాల వ్యవధిలో రెండు మహా విలయాలు..కాళ్ల కింద ఉన్న భూమి ఒక్కసారిగా కదిలిపోయింది. చూస్తుండగానే భవనాలు పేకమేడల్లా కుప్పకూలాయి. మృత్యువు వికటాట్టహాసం చేసింది. బాధితుల రోదనలు మిన్నంటాయి. మయన్మార్, థాయిలాండ్‌ల్లో శుక్రవారం నిమిషాల వ్యవధిలో రెండు శక్తివంతమైన భూకంపాలు సంభవించడంతో మహా విధ్వంసం చోటుచేసుకుంది. రెండు దేశాల్లో కనీసం 200 మంది పైగా మరణించినట్లు సమాచారం. కాగా, మయన్మార్ ప్రభుత్వం 150 మందికి పైగా మరణించినట్లు అధికారికంగా రాత్రి 12.30 గంటలకు ప్రకటించింది. శిథిలాల కింద చిక్కి వేల మంది గాయపడ్డారు. థాయిలాండ్‌లోనూ నలుగురు చనిపోయారు. కాగా శిథిలాల కింద అనేక మంది చిక్కుకొని ఉండటంతో మృతులు, క్షతగాత్రుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూనేవుంది. ఇరు దేశాలు అత్యయిక పరిస్థితి ప్రకటించి..అంతర్జాతీయ సాయం కోసం అర్థించాయి.

మిట్టమధ్యాహ్నం ముంచుకొచ్చిన మృత్యువు

మయన్మార్‌లో సంభవించిన భూకంపాల తీవ్రత రిక్టర్ స్కేలుపై వరుసగా 7.7, 6.4గా నమోదవగా బ్యాంకాక్‌లో 7.3గా నమోదైంది. మయన్మార్‌లో మిట్ట మధ్యాహ్నం 12.50 ప్రాంతంలో మొదటిసారి భూమి తీవ్రంగా కంపించింది. తర్వాత వరుసగా ఆరు సార్లు ప్రకంపనలు సంభవించాయి. భూమి తీవ్రంగా కంపించడంతో భవనాల్లోని అలారమ్‌లు మోగాయి. భయాందోళనలతో వేలాదిమంది ప్రజలు రోడ్లపైకి వచ్చారు. మయన్మార్‌లో వందలాది మంది పైగా మరణించారని స్థానిక మీడియా పేర్కొంది. శిథిలాల కింద చిక్కినవారి అచూకీ తెలియకపోవడంతో మృతుల సంఖ్య భారీగా వుండే అవకాశముంది. మయన్మార్, బ్యాంకాక్‌ల్లో అత్యవసర పరిస్థితి విధించారు. బ్యాంకాక్ నగరాన్ని విపత్తు ఏరియాగా ప్రకటించారు. రోడ్లు, వంతెనలు, భవనాలు పెద్ద సంఖ్యలో ధ్వంసమయ్యాయి. డ్యామ్‌ల పరిస్థితి పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. మొదటిసారి ప్రకంపనలు రాగానే మెట్రో రైలు వ్యవస్థతో సహా మొత్తంగా రవాణా వ్యవస్థనంతటినీ నిలిపివేశారు. గ్రేటర్ బ్యాంకాక్ ఏరియాలో కోటీ 70 లక్షల మందికి పైగా నివసిస్తుంటారు. వీరిలో చాలామంది బహుళ అంతస్తుల భవంతుల్లోనే జీవిస్తుంటారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో బ్యాంకాక్‌లో ప్రకంపనలు సంభవించాయి. ఈ భూకంపాల కారణంగా బ్యాంకాక్‌లో నిర్మాణంలో వున్న 30 అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలింది. ఈ సంఘటనలో ముగ్గురు మరణించగా, 90 మంది గల్లంతయ్యారని థాయిలాండ్ రక్షణ మంత్రి తెలిపారు. భవన శిథిలాల కింద 80 మంది వరకు చిక్కుకుని వుండవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భూకంపం ధాటికి నిర్మాణంలో వున్న పలు అంతస్తుల భవనం చిగురుటాకులా కంపిస్తూ కుప్పకూలడంతో పెద్ద ఎత్తున దుమ్ము మేఘాలు ఏర్పడ్డాయి. పైగా ఆ అంతస్తుల పైన క్రేన్ కూడా వుండడంతో ప్రజలు భయంతో కేకలు వేస్తూ రోడ్లపై పరుగులు పెడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భవనాలపై గల స్విమ్మింగ్ పూల్స్‌లోని నీరు అంత ఎత్తు నుండి జలపాతాల్లా కిందకు కారుతుండడం వీడియోల్లో కనిపిస్తోంది. భూ ప్రకంపనలు మరిన్ని రావచ్చనే భయంతో బ్యాంకాక్‌లోని ప్రజలు భవనాలు ఖాళీ చేసి రోడ్లపైనే మకాం వేశారు. మయన్మార్‌లోని సాగింగా నగరానికి వాయవ్యంగా భూమిలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం వుందని అమెరికా, జర్మనీ జియోలాజికల్ సర్వే సెంటర్లు తెలిపాయి. దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఈ భూకంపం ప్రభావం వుందని థాయిలాండ్ విపత్తు నిర్వహణా విభాగం తెలిపింది. పరిస్థితులను అంచనా వేసేందుకు ప్రధాని షినవ్రత అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.

నెపిడా ఆసుపత్రిలో అంతులేని విషాదం

మయన్మార్ రాజధాని నెపిడాలో వేయి పడకల ఆస్పత్రి భవనం పూర్తిగా నేలమట్టమైంది. ఈ శిథిలాల కింద డజన్ల సంఖ్యలో చిక్కుకుని వుండవచ్చని అనుమానిస్తున్నారు. అక్కడ పరిస్థితి వర్ణించేందుకు కూడా మాటలు చాలడం లేదని అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు తమ కథనాల్లో పేర్కొన్నారు. ఆస్పత్రి వెలుపల వరుసగా క్షతగాత్రులను నేలపైనే పడుకోబెట్టి చికిత్సలు అందిస్తున్నారు. ఈ ఆస్పత్రిని కొత్తగా నిర్మించారు. దీంతో ఇక్కడ మృతుల సంఖ్య అధికంగా వుండొచ్చుననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మయన్మార్‌లో రెండో అతిపెద్ద నగరమైన మాండలాయ్ భూకంప కేంద్రానికి సమీపంలో వుంది. మయన్మార్ ప్రాచీన రాజధాని నగరమైన ఈ మాండలేలో భూకంపం ధాటికి రాజభవనంలో కొంత భాగం, పలు ఇతర భవంతులు కూలిపోయాయి. ఇక్కడ మసీదు కూలిపోవడంతో శుక్రవారం ప్రార్థనలు చేస్తున్న వారిలో దాదాపు 20 మంది చనిపోయారని వార్తలు అందుతున్నాయి. ఈ ప్రాంతం భూకంపాలు తరచుగా సంభవించే ప్రాంతమైనందున సాధారణంగానే ఇక్కడ ప్రజలు తక్కువగా నివసిస్తుంటారు. పైగా పెద్ద పెద్ద ఎత్తైన భవనాలు వుండవు. ఈ నగరానికి సమీపంలో 90 ఏళ్ళనాటి వంతెన ఒకటి కుప్పకూలింది. మరో ప్రధాన నగరమైన యాంగాన్‌తో మందలాయ్‌ను కలుపుతున్న హైవేలో కొంత భాగం కూడా దెబ్బతింది. రాజధాని నెపిడాలో పలు ఆలయాల శిఖరాలు నేలమట్టమయ్యాయి. హెటెట్ నయాంగ్ నగరంలో టీ దుకాణం జనాలతో చాలా రద్దీగా వుందని, ఒక్కసారి ఆ దుకాణం కుప్పకూలిపోయిందని, అక్కడి పరిస్థితి చాలా భయంకరంగా వుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

భూకంప ధాటికి సాక్ష్యాలు ఈ చిత్రాలు...

భారత్, చైనాలోనూ...

ఈ భూకంపాల ప్రభావం పొరుగు దేశాలైన భారత్, చైనా, కంబోడియా, బంగ్లాదేశ్‌ల్లోనూ కనిపించింది. భారత్ లోని కోల్‌కతా, ఇంఫాల్, మేఘాలయల్లో ప్రకంపనలు నమోదయ్యాయి. భయాందోళనలతో ప్రజలు రోడ్లపైకి పరుగులు తీశారు. మేఘాలయలోని ఈస్ట్‌గారో హిల్స్‌లో ప్రకంపనల తీవ్రంగా 4గా నమోదవగా, బంగ్లాదేశ్‌లో 7.3గా నమోదైంది. చైనాలోని యునాన్, సిచువాన్ ప్రావిన్స్‌ల్లో కూడా భూకంపం ప్రభావం కనిపించింది. మయన్మార్‌తో గల సరిహద్దులోని రులీ నగరంలో ఇళ్ళు దెబ్బతిన్నాయి. కొందరికి గాయాలయ్యాయని చైనా మీడియా వార్తలు తెలిపాయి.

సాయమందించండి

ఈ భారీ విపత్తు వేళ అంతర్జాతీయ సమాజం చేయూతనందించాలని మయన్మార్ సైనిక పాలకులు విజ్ఞప్తి చేశారు. నెపిడాలో భూకంప బాధితులకు వైద్య సాయం అందిస్తున్న ఆసుపత్రిని మిలటరీ చీఫ్ మిన్ ఆంగ్‌లయాంగ్ సందర్శించారు.

భారతీయుల కోసం హెల్ప్‌లైన్

న్యూఢిల్లీ : థాయ్‌లాండ్‌లో భూకంపం సంభవించడంతో అక్కడి భారత రాయబార కార్యాలయం అప్రమత్తమైంది. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపింది. ఏ భారతీయ పౌరుడికీ అవాంఛనీయ ఘటన తలెత్తినట్లు తమ దృష్టికి రాలేదని తెలిపింది. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే.. థాయ్‌లాండ్‌లోని భారతీయులు ఎమర్జెన్సీ నంబర్ 66 618819218ను సంప్రదించాలని సూచించింది. బ్యాంకాక్‌లోని భారత రాయబార కార్యాలయం, చియాంగ్ మాయి నగరంలోని కాన్సులేట్ సభ్యులంతా సురక్షితంగా ఉన్నట్లు పేర్కొంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.

ఆ ప్లేట్ల కదలికలే కారణం

నెపిడా, బ్యాంకాక్ : శుక్రవారం సంభవించిన శక్తివంతమైన భూకంపాలు మయన్మార్, బ్యాంకాక్‌లను కుదిపేశాయి. తీవ్ర స్థాయిలో ఆస్తి నష్టం సంభవించింది. మృతుల సంఖ్య కూడా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు భూకంపం ఎందుకు వస్తుందనే ప్రశ్న వేసుకుంటే..భూ వైజ్ఞానిక పరిశోధనల ప్రకారం..భూగర్భంలో గల టెక్టానిక్ ప్లేట్ల కదలిక కారణంగా భూ గర్భం నుండి ఒక్కసారిగా విపరీతమైన శక్తి విడుదలై భూ ఉపరితలంపైకి వస్తుంది. భూమి యొక్క వెలుపలి కవచమైన లిథోస్పియర్ పెద్ద పెద్ద పలకలుగా విభజించబడి వుంటుంది. ఈ పలకలు చాలా నెమ్మదిగా కదులుతుంటాయి. ఇవి ఒకదానిని మరొకటి ఢీ కొన్నపుడు లేదా దూరంగా జరిగినపుడు, రెండు పలకలు రాసుకున్నపుడు పెద్ద మొత్తంలో శక్తి ఉద్భవిస్తుంది. ఈ శక్తి భూకంప తరంగాలుగా విడుదలవుతుంది. దాంతో భూమి ఒక్కసారిగా కంపిస్తుంది. అయితే సహజమైన ఈ కారణాలతో పాటు మానవ కార్యకలాపాలు కూడా భూ లోపలి పొరలపై తీవ్రమైన ఒత్తిడి రాజేసి ప్రకంపనలకు కారణమవుతున్నారని భూ విజ్ఞాన శాస్త్రవేత్తలు తెలిపారు. భారీ నీటి నిల్వ ప్రాజెక్టులు, గనుల తవ్వకాలు వంటివి వీటిలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

సాగింగ్ ఫాల్ట్ అంటే...

ఇండియన్ ప్లేట్, బర్మా మైక్రో ప్లేట్ మధ్య గల ప్రధాన సరిహద్దు పాయింట్ అయిన సాగింగ్ ఫాల్ట్ పొడవునా మయన్మార్ ప్రాంతం వుంది. భూమి పొరల అమరికలో లోపాలు వుండడాన్నే ఫాల్ట్ అని పిలుస్తారు. అందువల్లనే ఇక్కడ భూకంపాలు ఎక్కువగా సంభవిస్తూంటాయి. 1200 కిలోమీటర్ల పొడవునా గల ఈ ఫాల్ట్ కారణంగా మయన్మార్ అంతటా భూమిలోపల సెస్మిక్ యాక్టివిటీ ఎక్కువగా జరుగుతూ వుంటుంది. ఈ ప్లేట్లు ఏడాదికి 11 మిల్లీమీటర్లు నుండి 18 మిల్లీమీటర్ల చొప్పునే కదులుతూ వుంటాయి. కాలక్రమంలో నిరంతరంగా ప్లేట్ల కదలిక వల్ల ఒత్తిడి గణనీయంగా పేరుకుపోతుంది. అలా పేరుకుపోయిన ఒత్తిడి, ఒక్కసారిగా శక్తి రూపంలో విడులవుతుంది. అప్పుడు భూకంపం సంభవిస్తుంది.

వందేళ్ళలో 14 భూకంపాలు

ఈ సాగింగ్ ఫాల్ట్ కారణంగా మయన్మార్‌లో భూకంపాలు ఎక్కువగా సంభవిస్తూ వుంటాయి. అందుకే ఈ ప్రాంతాన్ని రెడ్ జోన్ అంటారు. గత వందేళ్ళలో ఈ ప్రాంతంలో 6 కంటే తీవ్రత ఎక్కువగా వున్న భూకంపాలు 14 వరకు వచ్చాయి. 1946లో వచ్చిన భూకంపం తీవ్రత 7.7 కాగా, 1956లో 7.1 తీవ్రత నమోదైంది. 1988లో, 2004ల్లో వచ్చిన భూకంపాల్లో వందలాదిమంది మరణించారు. 2011లో, 2016లో, తాజాగా 2025లో భూకంపాలు వచ్చాయి.

అతి భయంకరమైన పది భూకంపాలు

అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం..రిక్టర్ స్కేలుపై కంపన తీవ్రత అధికంగా నమోదై అత్యంత విషాదాన్ని మిగిల్చినవాటిలో పది భూకంపాలు, సునామీ ఘటనలు ఇవి..

- **వల్దివియాన్ భూకంపం**

  - 1960 మే 22

దీనినే గ్రేట్ చిలియన్ భూకంపం అని కూడా అంటారు. ప్రపంచంలో సంభవించిన అత్యంత కంపన తీవ్రత కలిగిన భూకంపం ఇదే. చిలీ తీరంలో వల్దివియా, ప్యుయెర్టో మోంట్ ప్రాంతం సమీపాన రిక్టర్ స్కేలుపై 9.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో దక్షిణ చిలీలో కనీసం 1655 మంది చనిపోయారు. మూడు వేల మంది పైగా గాయపడ్డారు. హవాయిలో 61 మంది, జపాన్‌లో 138 మంది, ఫిలిప్పీన్స్‌లో 32 మంది చనిపోయారు. దాదాపు 20 లక్షల మంది నిర్వాసితులుగా మారారు. హవాయి, జపాన్, అమెరికా పశ్చిమ కోస్తాలో సునామీ సంభవించి తీవ్ర నష్టం వాటిల్లింది.

- **గ్రేట్ అలస్కా భూకంపం**

  - 1964 మార్చి 28

గుడ్ ఫ్రైడే మహా విపత్తుగా పేరొందిన ఈ భూకంపం దక్షిణ అలస్కాలో రిక్టర్ స్కేలుపై 9.2 తీవ్రతతో సంభవించింది. కంపన ప్రభావంతో సునామీ కూడా ముంచెత్తింది. 131 మంది చనిపోయారు. యాంకరేజ్, ఛిటినా, గ్లేన్నాల్లెన్, హోమర్, హోప్ సహా అలస్కాలోని అనేక నగరాల్లో రూ.2000 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించింది. విద్యా భవనాలు నేలమట్టం కావడంతో పాఠశాల వ్యవస్థ మొత్తం తీవ్ర ప్రభావానికి గురైంది.

- **సుమత్రా - అండమాన్ దీవుల్లో భూకంపం - 2004 డిసెంబరు 26**

ఈశాన్య సముద్రాకు పశ్చిమ కోస్తా తీరాన 9.1 కంపన తీవ్రతతో భూకంపం, సునామీ చోటుచేసుకున్నాయి. 2,83,000 మంది పైగా చనిపోయారు. మానవ చరిత్రలో అత్యంత ప్రాణం నష్టం సంభవించినది ఈ భూకంపం వల్లేనని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఆసియా, ఆఫ్రికాల్లోని 10 దేశాల్లో పది లక్షల మంది పైగా తమ స్వస్థలాల వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లాల్సివచ్చింది.

- **జపాన్ భూకంపం, సునామీ**

  - 2011 మార్చి 11

దీనినే గ్రేట్ తోహోకు భూకంపం అంటారు. ఇది జపాన్‌లో 9.1 కంపన తీవ్రతతో సంభవించింది. భూకంపం సంభవించిన 30 నిమిషాల్లోనే సునామీ కూడా ముంచెత్తింది. దీంతో మూడు అణు విద్యుత్ రియాక్టర్లు ధ్వంసం కావడంతో కకావికల పరిస్థితి చోటుచేసుకుంది. దీని కారణంగా వందలాది అగ్ని ప్రమాదాలు చోటుచేసుకన్నాయి. సముద్ర జలాల్లో రేడియో ధార్మిక పదార్థాలు కలిసిపోవడంతో పర్యావరణ పరంగానూ పెను సవాళ్లు ఎదురయ్యాయి. దాదాపు 18 వేల మంది పైగా చనిపోయారు. వేలాది మంది ఆచూకీ ఇప్పటికీ తెలియడం లేదు. పది లక్షల మంది పైగా క్షతగాత్రులయ్యారు. హవాయి, కాలిఫోర్నియా, పెరు, గలాపగోస్ దీవాలు ల్లోనూ సునామీ ప్రభావంగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది.

- **కామచట్కా, రష్యా**

  - 1952 నవంబరు 4

రష్యాలోని కామచట్కాలో 9.0 తీవ్రతతో సంభవించిన ఈ భూకంపం కూడా సునామీకి దారి తీసింది. 4 వేల మంది పైగా ప్రాణాలు కోల్పోయారు. భారీ ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది.

- **చిలీ భూకంపం - 2010 ఫిబ్రవరి 27**

చిలీ, క్యురిహ్యూ సమీపాన 8.8 తీవ్రతతో భూకంపం, సునామీ చోటుచేసుకోవడం దక్షిణ అమెరికా ప్రాంతమంతటా పెను విషాదం చోటుచేసుకున్నది. దాదాపు 500 మంది చనిపోవడంతో పాటు 12 వేల మంది పైగా గాయపడ్డారు.

- **ఈక్వెడార్ - కొలంబియా భూకంపం - 1906 జనవరి 31**

ఈక్వెడార్ కోస్తా తీరం సమీపాన 8.8 కంపన తీవ్రతతో భూకంపం సంభవించి సునామీ ముంచెత్తింది. ఈక్వెడార్, కొలంబియాలో 500 మంది పైగా చనిపోగా, 1500 మంది గాయపడ్డారు. హిలో, హవాయిపై సునామీ పెను ప్రభావం చూపింది.

- **ర్యాట్ ఐలాండ్స్ భూకంపం - 1965 ఫిబ్రవరి 4**

అలస్కా దీవుల సమూహమైన ర్యాట్ ఐలాండ్స్‌లో 8.7 తీవ్రతతో భూకంపం సంభవించి అది సునామీకి దారితీసింది. మరణాలేవీ సంభవించలేదు కానీ భారీ ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లింది.

- **అస్సాం - టిబెట్ భూకంపం - 1950 ఆగస్టు 15**

భారత్, టిబెట్‌లో 8.6 తీవ్రతతో చోటుచేసుకున్న ఈ భూకంపం కారణంగా 1500 మంది పైగా మృత్యువాత పడ్డారు. దీవుల్లోని గ్రామాలు మొత్తం ఈ భూకంపం కారణంగా తుడిచిపెట్టుకుపోయాయి.

- **హిందూ మహాసముద్రం, సమత్రా భూకంపం - 2012 ఏప్రిల్ 11**

సమత్రా తీరంలో 8.6 కంపన తీవ్రతతో సంభవించిన ఈ భూకంపం వల్ల ఇండోనేషియాకు సమీపంలో హిందూ మహాసముద్రంలో రెండు సార్లు ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. సమత్రా, జావా దీవులతో పాటు దక్షిణ, వాయువ్య ఆసియా మొత్తం అతలాకుతలమైంది. వీటి కారణంగా 12 మంది వరకు చనిపోయారు, భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

నా జీవితంలో ఇలాంటి భూకంపాన్ని చూడలేదు ...

- ప్రత్యక్ష సాక్షి వ్యాఖ్యలు

బ్యాంకాక్ : తన ఎదురుగా వున్న లైట్ ముందుకు వెనక్కి ఊగుతుండడాన్ని చూసిన వెంటనే వొరనూత్ తిరావత్‌కు ఏదో అనర్థం జరగబోతోందని అనిపించింది. ఆ వెంటనే భవనం కంపిస్తూ బీటలు వారడాన్ని ఆమె చూసింది. ఇక క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆమె, ఆమె సహచరులు ఒక్కసారిగా 12 అంతస్తుల భవనం మెట్లపైకి పరుగులు పెట్టారు. 'నా జీవితంలో ఎన్నడూ కూడా ఇంతటి భయంకరమైన భూకంపాన్ని బ్యాంకాక్‌లో చూడలేదు.' అని సెంట్రల్ బ్యాంకాక్‌లో లాయర్‌గా పనిచేస్తున్న తిరావత్ వ్యాఖ్యానించారు. ఇంగ్లండ్ నుండి వచ్చిన టూరిస్ట్ పాల్ విన్సెంట్ ఆ సమయంలో రోడ్డు పక్కన గల బార్‌లో వున్నారు. ఒక్కసారిగా రోడ్లపై జనాలు పరుగులు పెడుతూ భయంతో కేకలు వేస్తూ కనిపించారని ఆయన చెప్పారు. దీంతో తనకు ఒక్కసారిగా భయం వేసిందని వెంటనే బయటకు రాగానే బహుళ అంతస్తుల భవనం ఊగుతుండడం చూశానని, భవనం పై అంతస్తుల గల స్విమ్మింగ్ పూల్ నుండి నీరు కిందకు పడడాన్ని కూడా చూశానని చెప్పారు.

కలిసికట్టుగా పునర్నిర్మించుకుందాం

మయన్మార్ ప్రధాని మహ్‌న్ విన్

వాటికన్ సిటీ : "ఈ రోజు సంభవించిన భూకంప దృశ్యాలను చూస్తుంటే హృదయం ద్రవిస్తోంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో, మనందరం ఒక తాటిపై నిలబడి, ఈ విలయాన్నుండి బయటపడి భవిష్యత్తును పునర్నిర్మించుకోవాల్సి వుంది. సాధ్యమైనంతగా మన ప్రజలకు మనం సాయమందించాలి, ప్రతి సాయమందించే చేయి, ప్రతి చిన్న కార్యాచరణ కూడా ఈ సమయంలో ఎంతో విలువైనవి.' అని మయన్మార్ ప్రధాని మహ్‌న్ విన్ ఖయాంగ్ తన్ వ్యాఖ్యానించారు.

రక్త దానం చేయండి : జుంటా పిలుపు

క్షతగాత్రులు కోసం రక్త దానానికి ముందుకు రావాల్సిందిగా మయన్మార్ జుంటా పిలుపిచ్చింది. అవసరమైన వారికి అందచేసేందుకు వీలుగా ఔషధాలు, ఇతర మెడికల్ సరఫరాలు కావాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మిలటరీ ప్రభుత్వ ప్రతినిధి జా మిన్ తున్ టెలివిజన్లలో పిలుపిచ్చారు.

భూకంప బాధితుల కోసం పోప్ ప్రార్థనలు

మయన్మార్, బ్యాంకాక్‌ల్లో సంభవించిన భూకంప బాధితుల కొరకు పోప్ ఫ్రాన్సిస్ ప్రార్థనలు చేశారు. డబుల్ న్యుమోనియాతో బాధపడుతూ గత ఐదు వారాలుగా ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఆరు రోజుల క్రితం ఆదివారమే ఇంటికి తిరిగి వచ్చిన పోప్, క్షతగాత్రులు వెంటనే కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. మయన్మార్, థాయిలాండ్‌ల్లో తలెత్తిన ప్రకృతి వైపరీత్యాలు గురించి పోప్‌కు తెలియచేసినట్లు వాటికన్ ప్రకటించింది.

పటిష్టంగానే ఆకాశ హర్మ్యాలు : బ్యాంకాక్ ప్రధాని షినవ్రత

బ్యాంకాక్‌లోని బహుళ అంతస్తుల భవనాలు తగిన ప్రమాణాలతోనే నిర్మించబడ్డాయని, మరింత బలమైన భూకంపం సంభవించినా అవి తట్టుకుని నిలబడతాయని థాయిలాండ్ ప్రధాని షినవ్రత చెప్పారు. ప్రస్తుతం సంభవించిన విలయంలో దెబ్బతిన్న కట్టడాలు ఇంకా నిర్మాణం జరుగుతున్నవేనని చెపారు.

బాధితులకు థాయిలాండ్ రాజు సాయం

బ్యాంకాక్‌లోని చాతుచక్ ప్రాంత భూకంప బాధితుల కోసం సహాయ బలగాలను మోహరించాల్సిందిగా థాయిలాండ్ రాజు రాజప్రజానుగ్రహ ఫౌండేషన్‌ను ఆదేశించారు. 500 భోజనాలు, తాగు నీరు, టెంట్లు, ఇతరత్రా సామాగ్రిని తొలి సాయంగా అందచేశారు. కాగా థాయిలాండ్ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే వుందని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఆర్థిక కార్యకలాపాలనీన సజావుగానే సాగుతున్నాయన్నారు. ఈ భూకంప బాధితుల కోసం అవసరమైన సహాయక చర్యలు చేపట్టడానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో తోడ్పాటునందిస్తుందని చెప్పారు.

జిన్‌పింగ్‌తో యూనస్ భేటీ



బీజింగ్ : బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్‌తో శుక్రవారం సమావేశమయ్యారు. చైనా అందించే రుణాలపై వడ్డీ రేట్లను 3 శాతం నుండి 1-2 శాతానికి తగ్గించాలని, చైనా నిధులతో కూడిన ప్రాజెక్టులపై కమిట్‌మెంట్ రుసుమును రద్దు చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. నాలుగు రోజుల పర్యటన కోసం గురువారం యూనస్ చైనా చేరుకున్న సంగతి తెలిసిందే. విమానాశ్రయంలో యూనస్‌కు చైనా ఉప విదేశాంగ మంత్రి సన్ వీడాంగ్ స్వాగతం పలికారు. అనంతరం హైనాన్‌లో జరిగిన బోవో ఫోరం ఫర్ ఆసియా వార్షిక సదస్సులో యూనస్ పాల్గొన్నారు. ఈ సదస్సులో చైనా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రీమియర్ డింగ్ జుయెక్సి యాంగ్‌తో సమావేశమయ్యారు. బంగ్లాదేశ్‌లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులలో చైనా మద్దతును కోరినట్లు బంగ్లాదేశ్ మీడియా తెలిపింది. రెడీమేడ్ దుస్తులు, ఎలక్ట్రిక్ వాహనాలు, తేలికపాటి యంత్రాలు, హైటెక్ ఎలక్ట్రానిక్స్, చిప్ తయారీ, సోలార్ ప్యానెల్ పరిశ్రమలు సహా చైనా తయారీ పరిశ్రమల తరలింపు సులభతరం చేయడంలో మద్దతు అందించాల్సిందిగా జుయెక్సిని కోరినట్లు పేర్కొంది. ఈ సదస్సులో యూనస్ రష్యా ఉప ప్రధాని అలెక్సీ ఓవర్‌చుక్‌తో కూడా సమావేశమయ్యారు.

రబీలోనూ కరువుకు కోతలే

(మొదటి పేజీ తరువాయి)

53 మండలాల్లో వర్షాభావం ఉండగా అప్పటికి 541 మండలాల్లో డ్రైస్పెల్ ఉంది.

జనవరి తర్వాత కూడా..

జనవరిలో 429 మండలాల్లో, ఫిబ్రవరిలో 628 మండలాల్లో చినుకు పడలేదు. మార్చిలోనూ పరిస్థితి అంతే. వర్షం లేక డ్రైస్పెల్ తీవ్రమైంది. కానీ ప్రభుత్వం మాత్రం సగటు వర్షపాత అంచనాలను లెక్కలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్‌లో 53 మండలాల్లో వర్షాభావం ఉందన్న కొలబద్ద ఆధారంగా ఆ మేరకు కరువు మండలాలను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. వర్షాభావం, పంట నష్టం, డ్రైస్పెల్, సాగు స్థితిగతులు, ఉష్ణోగ్రతలు, భూగర్భ జలాలు.. వీటి ఆధారంగా కరువును గుర్తిస్తారు. ఆ నిబంధనలన్నింటినీ పరిశీలించామని సర్కారు చెబుతోంది. క్షేత్ర స్థాయిలో అదేమీ కనిపించట్లేదన్న విమర్శలొస్తున్నాయి. రబీలో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాభావం, డ్రైస్పెల్స్ ఉన్నాయి. రాయలసీమ, ప్రకాశం, పల్నాడు, నెల్లూరు, ఉత్తరాంధ్ర, ఇతర మెట్ట ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం, డ్రైస్పెల్స్ సేద్యాన్ని కుదేలు చేశాయి.

సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్లపై జనాగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

వద్ద నిరసనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపుపై ఎన్నికల ముందు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో తహశీల్దార్ కార్యాలయాలు, విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం కన్నయ్యగూడ గ్రామంలో విద్యుత్తు బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ప్రజలపై భారాలు వేయబోమని నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ట్రూఅప్ ఛార్జీల పేరిట భారాలు వేస్తున్నారని వివరించారు. సాలూరు, పాలకొండ, బలిజిపేట, విజయనగరంలోని ప్రాంతీయ విద్యుత్తు కార్యాలయం వద్ద, చీపురుపల్లిలో సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిరసన తెలిపారు. అనకాపల్లిలో ఆర్‌టిసి కాంప్లెక్స్ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందార్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే రూ.15,485 కోట్ల విద్యుత్ భారాలను ప్రజలపై మోపిందన్నారు. అల్లూరి జిల్లా అరకులోయలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. విశాఖ జిల్లాలో మల్కాపురం, కంచరపాలెం, సీతమ్మధార, గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, తగరపువలస, ఆరిలోవ, మధురవాడ, జగదాంబ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద విద్యుత్ బిల్లులను దహనం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. తాడేపల్లిగూడెం, ఉండి, గణపవరం, వీరవాసరం, తణుకు మండలం వేల్పూరు, పాలకోడేరు, మోగల్లు, విస్సాకోడేరుల్లో సచివాలయాల వద్ద, నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, ఆకివీడు, ఆచంట, కాళ్ల, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో సబ్‌స్టేషన్ల వద్ద నిరసన తెలిపారు. గుంటూరులోని గుజ్జనగుండ్ల విద్యుత్ ఎఇ కార్యాలయం వద్ద; మంగళగిరిలో ఎడిఎ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తాడేపల్లి; నరసరావుపేట; తెనాలిల్లో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద, నిరసన తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా కడపలో విద్యుత్ భవన్ ఎదుట, అన్నమయ్య జిల్లా మదనపల్లెలో విద్యుత్ ఇఇ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తిరుపతి జిల్లా రేణిగుంటలో విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి విద్యుత్ బిల్లులను దహనం చేశారు. వెంకటగిరిలో సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం, ఉయ్యూరు, అవనిగడ్డ, గుడివాడ, మొవ్వ, గూడూరు, గన్నవరం, చల్లపల్లి, కంకిపాడు, మోపిదేవి మండలాల్లో, ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట, విసన్నపేట, మైలవరం, రెడ్డిగూడెం, తిరువూరు మండలాల్లో నిరసనలు తెలిపారు. నెల్లూరు జిల్లా గుడ్లూరులో విద్యుత్ కార్యాలయం, శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, టెక్కలి, కొత్తూరు మండలాల్లో విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు.

మీకోసం

పట్టుచీరలు ఉతికేటప్పుడు బకెట్‌లో కొంచెం నిమ్మరసం వేయడం వల్ల రంగు పోవు.

జీవన సౌరభం

భయపడడం ఎప్పుడు మానేస్తామో..అప్పడే మన జీవితం మొదలైనట్లు

బాల్యం

బాల్యం
మరపురాని
మధుర కావ్యం
ముద్దులొలికే
బాల్యం నవ్యం భవ్యం

ఏ కల్మషమంటని
బాల్యం అద్భుతానికి ప్రతిరూపం
చెట్టాపట్టాలు
వేసుకొంటారు
చిన్నీ బిన్నీ
ఆడుకొంటారు
తమ ఆనందానికి
హద్దులు లేవంటారు

పక్షిలా
ఎగరాలనుకొంటారు
చేపలా
ఈదాలనుకొంటారు
చందమామను
అందుకోవాలనుకొంటారు
నక్షత్రాలను
నేలకు దింపాలనుకొంటారు

బాల్యానికి
అసాధ్యం ఏదీ లేదు
రకరకాల ప్రశ్నలు
వేస్తారు జవాబు చెప్పమని
సతాయిస్తారు

ఆ బుర్రకు
పుట్టెడు బుద్ధులు
పుట్టుకతోనే వారు సిద్ధులు
కులం లేదు
మతం లేదు
వర్గం లేదు
ప్రాంతం లేదు
తెలిసిందల్లా

నెనరును పంచటమే
ఐకమత్యాన్ని పెంచటమే
ఒక్కసారి బాల్యంలోకి
వెళ్ళాలనిపించదూ

పెద్దలూ
పిల్లలను చూచి
నేర్చుకోవాలి
సరికొత్త ప్రపంచాన్ని
నిర్మించాలి

- మంకు శ్రీను,
కొప్పర్రు, పశ్చిమ గోదావరి జిల్లా,
93471 00598.

అంకెలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ



బి. రుత్విక్, 5వ తరగతి,
ప్రాథమిక పాఠశాల, నార్లాపూర్
నిజాంపేట మండలం, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విమర్శిస్తే దాడులు చేస్తారా?

దక్షిణాది రాష్ట్రాల్లో పెద్దగా కనిపించని స్టాండప్ కామెడీ ఉత్తరాదిలో ప్రభావంతమైన పాత్రని పోషిస్తోంది. అక్కడ ఈ వ్యంగ్య హాస్యాన్ని చాలామంది సామాజిక అంశాలతో జోడించి ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా రాజకీయ నాయకుల తీరుతెన్నులను, పాలనా వైఫల్యాలను తమ హాస్యచతురోక్తులతో ఎండగడుతున్నారు. అవేమీ పర్సనల్, ప్రైవేట్ విషయాలు కాదు.. ఎవరికీ తెలియనివీ కాదు. అందరికీ తెలిసినవి.. చూస్తున్నవి. ముఖ్యంగా ఆలోచించాల్సిన విషయాలు. అటువంటి వాటిని ఎత్తిచూపే సాహసం చేస్తున్న ఆ కమెడియన్ల చొరవ అభినందనీయం.. కానీ కొంతమంది పెద్దలకు ఆ చతురలు పదునైన బాకుల్లా గుచ్చుకుంటున్నాయి. ఆ వ్యాఖ్యలు గుండెల్లో మంట పుట్టిస్తున్నాయి. అందుకే ఆ కమెడియన్లపై వేధింపులకు దిగుతున్నారు. బెదిరిస్తున్నారు. భయపెడుతున్నారు. అయితే ఆ తాటాకు చప్పుళ్లకు ఏమాత్రం భయపడకుండా తాము ఎంచుకున్న దారిలో ధైర్యంగా ముందుకు నడుస్తున్న ఎందరో స్టాండప్ కమెడియన్ల జాబితాలో తాజాగా కునాల్ కమ్రా పేరు వినిపిస్తోంది.

ముంబయిలో ఓ ప్రదర్శనలో పాల్గొన్న కునాల్, అక్కడి రాజకీయ పరిస్థితులు, నాయకుల తీరుతెన్నులపై తనదైన వ్యంగ్య హాస్యాన్ని సంధించారు. శివసేన నమ్మినబంటుగా ఉన్న ఏక్‌నాథ్ షిండే ఆ పార్టీని చీల్చి శివసేన షిండే పేరుతో కొత్త పార్టీని ఏర్పాటుచేశారు. ఆ తరువాత జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో షిండేపార్టీ, ఎన్‌సిపి, బిజెపి కూటమిగా ఏర్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. షిండే చూపించిన స్వామిభక్తికి ప్రసన్నులైన బిజెపి పెద్దలు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పదవిని అతనికి కట్టబెట్టారు. ఈ మొత్తం వ్యవహారంపైనే కునాల్ తన వ్యంగాస్త్రాన్ని సంధించారు. షిండేని ఉద్దేశించి 'ట్రైయేటర్' (దేశద్రోహి) అని సంబోధించారు.

ఈ వ్యాఖ్యలు షిండే అనుచరులకు, బిజెపి పెద్దలకు గట్టిగా తగిలాయి. ఆ వ్యాఖ్యలకు బదులుగా తాము కూడా వాదనలు చేస్తే చర్చ ఇంతవరకు వచ్చేది కాదు.. కానీ అధికారంలో ఉన్నామన్న అహంకారంతో అనుచరుల పేరుతో రౌడీ మూక రంగంలోకి దిగింది. కునాల్‌ని బెదిరిస్తూ, భయపెడుతూ సోషల్‌మీడియాలో పోస్టులు చేసింది. ప్రదర్శన చేసిన స్టూడియోలోకి అక్రమంగా చొరబడి కనపడిన సామానంతా ధ్వంసం చేసింది. మున్సిపల్ అధికారులైతే నిబంధనలకు విరుద్ధంగా కట్టారని ఆ హోటల్‌ని కూల్చేశారు.

ఈ మొత్తం వ్యవహారం చూస్తే కక్ష్య సాధింపు చర్య స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఈ బెదిరింపులకు, దౌర్జన్యాలకు కునాల్ అదరలేదు, బెదరలేదు.. ఈసారి వ్యంగ్యంగా కాదు.. చాలా ఘాటుగా స్పందించాడు. 'ఈ దాడులు నాకు కొత్త కాదు.. అయినా నేను ప్రతిఘటిస్తూనే ఉంటాను. నా ప్రదర్శనలు జరగకుండా మీరు ఆపగలరు కానీ, నా మాటల వెనుక ఉన్న సత్యాన్ని మీరు ఆపలేరు' అంటూ వ్యాఖ్యానించారు. హోటల్ ఘటనపై మాట్లాడుతూ 'సర్వ్ చేసిన బటర్ చికెన్ బాగోలేదని, టమాటాలు తీసుకెళ్తున్న లారీని బోల్తో కొట్టించినంత తెలివితక్కువ పని ఇది' అని విమర్శించారు.

కునాల్‌కి ఈ దాడులు, బెదిరింపులు కొత్త కాదు. అతను 2013లో స్టాండప్ కామెడీ ప్లాట్‌ఫామ్‌పై అడుగుపెట్టినప్పటి నుండీ ఇవి మొదలయ్యాయి. బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలో తలెత్తిన పరిస్థితులపై కునాల్ తన షోలలోనే కాదు, సామాజిక మాధ్యమాల్లో కూడా బలమైన వ్యంగ్యాస్త్రాలని వినిపించేవారు. అతి జాతీయ వాదం, భారత సైన్యంపై ప్రభుత్వ వైఖరి, నోట్ల రద్దుపై వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై హత్యా బెదిరింపులు వచ్చాయి. 'రాజకీయ నాయకుల ప్రభావంతో ఇంటి యజమాని ఇల్లు ఖాళీ చేయమ'ని చెప్పినట్లు అప్పట్లో కునాల్ తన ఫేస్‌బుక్‌లో రాశారు.

అర్నబ్ గోస్వామి..

2020లో ఇండిగో విమానంలో ప్రయాణం చేస్తున్నప్పుడు జరిగిన ఓ ఘటనకి సంబంధించిన వీడియోను కునాల్ తన ట్విట్టర్‌లో షేర్ చేశారు. రిపబ్లిక్ టీవీ వ్యవస్థాపకుడు అర్నబ్ గోస్వామి ఆ వీడియోలో ఉన్నారు. అతన్ని ఉద్దేశించి కునాల్ మాట్లాడుతూ.. 'నేను ఇక్కడ ఓ కోవర్డ్ జర్నలిస్టుతో మాట్లాడుతున్నాను. ఇతను నేను ఊహించినట్లు గానే ఇప్పుడు కూడా మౌనంగా ఉన్నాడు' అన్నాడు. అది సోషల్ మీడియాలో పెద్ద దుమారాన్నే లేపింది. ఇండిగో ఎయిర్‌లైన్స్ 9 నెలల పాటు ఆయన విమాన ప్రయాణాలపై నిషేధం విధించింది. ఎయిర్ ఇండియా, స్పేస్‌జెట్, గోఎయిర్ కూడా ఆ నిషేధాన్ని అమలు చేశాయి.

సల్మాన్ ఖాన్

డబ్బు, పలుకుబడి ఉన్న వ్యక్తులు ఈ దేశంలో నేరం చేసినా నిర్దోషులుగా ఎలా బయటపడతారో ఓ స్టేజి షోలో కునాల్ ఉదహరించారు. బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌పై 1998లో కృష్ణజింక కేసు, ఆ తరువాత 2002లో హిట్ అండ్ రన్ కేసు నమోదైంది. ఇంత పెద్ద కేసుల్లో నిందితుడిగా ఉన్న సల్మాన్‌ని 2015లో బాంబే హైకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. దీనిపైనే కునాల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలకి తనపై సల్మాన్ పరువునష్టం దావా వేస్తున్నాడని తెలిసినా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోనని ఆయన కరాఖండిగా చెప్పారు.

సుప్రీంకోర్టు

దేశ అత్యున్నత న్యాయస్థానం ఒకానొక సందర్భంలో ఇస్తున్న ఏకపక్ష తీర్పులపై కూడా కునాల్ తనదైన రీతిలో స్పందించారు. 'దేశంలో ఎక్కడ చూసినా అసహనం పెరుగుతోంది. ఇక్కడ నేరం చేయడం ప్రాథమిక హక్కుగా పరిగణిస్తున్నారు. ఇది ఎంతలా పెరిగిందంటే చాలామంది నేరాలు చేయడాన్ని తాము ఎంతగానో ఇష్టపడే జాతీయ క్రీడలా చూస్తున్నారు' అని వ్యాఖ్యానించారు.

విశ్వహిందూపరిషత్‌కి బహిరంగ లేఖ

సామాజిక, రాజకీయ అంశాలపై విమర్శనాస్త్రాలు సంధించే కునాల్ 2022 సెప్టెంబరులో విహెచ్‌పికి బహిరంగ లేఖ ఒకటి రాశారు. 'హిందూ అనుకూల, ఉగ్రవాద వ్యతిరేక సంస్థ అని నిరూపించుకోవాలంటే.. మహాత్మా గాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేని హంతకుడిగా ప్రకటించాలి. ఆయన్ని వ్యతిరేకించాలి. అలాగే తాను ఎక్కడైనా హిందూ మతాన్ని అగౌరపరిచినట్లు ఉంటే దాన్ని రుజువు చేయాల'ని సవాల్ విసిరారు. భజరంగ్‌దళ్, విహెచ్‌పి కలిసి గురుగ్రామ్‌లో జరిగే కునాల్ షో జరగకుండా అడ్డుకున్నారు. ఆ సందర్భంలో కునాల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

'నేను ప్రభుత్వంపై మాత్రమే వ్యంగ్యం చేస్తాను. మీరు ప్రభుత్వానికి ఇష్టమైన వారా? అయితే బాధపడవచ్చు. ఇందులోకి హిందువు ఎలా వచ్చాడు? దేవునితో నా సంబంధం గురించి మీరు నాకు పరీక్ష పెట్టక్కర్లేదు. నేనే మీకు పరీక్ష పెడుతున్నా. నేను బిగ్గరగా జైశ్రీరామ్, జై రాధాకృష్ణ అంటాను. అంతే స్వరంతో మీరు గాడ్సే ముర్దాబాద్ అని అరవండి. గాడ్సే మీకు దేవుడు కాదు కదా! తప్పులేదు.. మీరు అలా చేయకపోతే మీరు హిందూ వ్యతిరేకి అని, ఉగ్రవాద అనుకూలురని నేను భావిస్తాను' అంటూ కునాల్ రాసిన బహిరంగ లేఖ ఎందరో 'దేశభక్తుల' హృదయాలను భగ్నం చేసింది.

ఇవన్నీ కునాల్ తన సొంత ప్రయోజనాల కోసం చేసిన వ్యాఖ్యలు కాదు. దేశ వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నంలో చేసినవి. కునాల్ వ్యాఖ్యలు నచ్చకపోతే వాటిపై వాదప్రతివాదనలకు దిగాలి. అంతేకాని దాడులు, బెదిరింపులకు దిగడం ఎంతమాత్రమూ సముచితం కాదు.. తాజా సుప్రీం తీర్పు కూడా ఈ విషయాన్ని స్పష్టపర్చింది.

'సినిమాలు, కవిత్వం.. సాహిత్యం, వ్యంగ్యం.. మనుషుల జీవితాన్ని మరింత అర్థవంతం చేస్తాయి. ఆలోచనలు, అభిప్రాయాలను వ్యక్తీకరించే స్వేచ్ఛ లేనప్పుడు.. ఆర్టికల్ 21 ప్రకారం గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం ఎలా సాధ్యమవుతుంది? ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో.. విభిన్న అభిప్రాయాలను.. ప్రతివాదనలతో ఎదుర్కోవాలే తప్ప అణచివేతతో కాదు.

ఒకవేళ ఆ వ్యాఖ్యలపై ఆంక్షలు విధించాల్సి వస్తే.. అవి సహేతుకంగా ఉండాలే గానీ.. ఊహాజనితంగా కాదు. ఓ వ్యక్తి అభిప్రాయాలను ఎక్కువమంది వ్యతిరేకించినా సరే.. ఆ వ్యక్తి భావ ప్రకటనా హక్కును తప్పనిసరిగా గౌరవించాల్సిందే. భావ స్వేచ్ఛ ప్రకటన, వాక్ స్వాతంత్ర్యం ప్రజాస్వామ్యంలో అంతర్భాగం. ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడటం న్యాయస్థానాల విధి. పోలీసులు రాజ్యాంగ ఆదర్శాలకు కట్టుబడి ఉండాలి. అంతిమంగా.. ఆర్టికల్ 19(1)ను కాపాడాల్సిన బాధ్యత న్యాయమూర్తులదే' అని ధర్మాసనం తాజా తీర్పులో స్పష్టం చేసింది.

పట్టువిడువని గిగ్ వర్కర్లు

- స్విగ్గీ డెలివరీ బాయ్‌పై దాడిని ఖండిస్తూ విశాఖలో కొనసాగుతున్న నిరసన
- ఆక్సిజన్ టవర్స్ వారికి పార్సిల్స్ అందించని వైనం

విశాఖలో ఆందోళనకు దిగిన డెలివరీ బాయ్స్ (ఫైల్)



ఆక్సిజన్ టవర్స్ వద్ద కిందనే పార్శిల్‌ను వదిలేసి వెళ్లిన డెలివరీ బాయ్

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

విశాఖలో గిగ్ (స్విగ్గీ, జొమాటో) వర్కర్లు పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. వారం రోజుల క్రితం స్విగ్గీ డెలివరీ బాయ్‌పై సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో జరిగిన దాడిని ఖండిస్తూ వారు తమ నిరసన గళాన్ని వినిపిస్తున్నారు. ధనికులు నివసించేదిగా పేరుగాంచిన ఆక్సిజన్ టవర్స్‌లో ఉంటున్న వారికి శుక్రవారమూ డెలివరీలను నేరుగా బాయ్స్ చేర్చలేదు. ఆర్డర్ చేసిన వస్తువులను, పదార్థాలను వాచ్‌మ్యాన్ దగ్గరే విడిచి వెళ్లిపోతున్నారు. ఈ టవర్స్‌లో గతంలోనూ కింది స్థాయి పనివారిపై దాడులు జరిగాయి. చేసిన తప్పు తెలుసుకోవాలన్న కారణంతో తామిలా చేస్తున్నామని డెలివరీ బాయ్స్ చెబుతున్నారు. తామూ మనుషులమేనని అపార్టుమెంట్ వాసులు గుర్తించాలన్నారు.

'బ్రో' అన్నందుకే దాడి

సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ బి బ్లాక్‌లోని 29వ అంతస్తులో నివసిస్తున్న ప్రసాద్ అనే వ్యక్తి స్విగ్గీలో ఈ నెల 21న ఫుడ్ ఆర్డర్ చేశారు. డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న అనిల్.. ఫుడ్ పార్శిల్‌తో ప్రసాద్ ఫ్లాట్‌కు వెళ్లారు. కాలింగ్ బెల్ కొట్టగానే ఒక మహిళ వచ్చారు. అనిల్ మాటలు అర్థంకాక ప్రసాద్‌కు తెలియజేశారు. ప్రసాద్ బయటకు వచ్చి అనిల్‌ను అడగ్గా 'మీకు ఫుడ్ పార్శిల్ వచ్చింది బ్రో' అని చెప్పారు. దీంతో ఆగ్రహించిన ప్రసాద్ 'సార్ అని కాకుండా బ్రో అంటావా?' అంటూ అనిల్‌పై దాడి చేశారు. ఆపై సెక్యూరిటీ సిబ్బందితో కలిసి అనిల్‌ను కొట్టి, బట్టలు విప్పించి అండర్‌వేర్‌తో గేటు బయట నిలబెట్టారు. క్షమాపణ కోరుతూ ఒక లేఖ రాయించుకున్నారు. ఈ అవమానంతో మనస్తాపం చెందిన అనిల్ ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఈ అమానవీయ ఘటన గిగ్ వర్కర్స్‌ను కదిలించింది. మరుసటి రోజు డెలివరీ బాయ్స్ ఆక్సిజన్ టవర్స్ వద్ద నిరసన తెలిపారు. అనిల్‌పై దాడి చేసి అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ పోరాటంతో పోలీసులు ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్కడెక్కడో ఉండే ఈ గిగ్ వర్కర్స్ ఐక్యంగా ముందుకొచ్చి పోరాటం చేసి విజయం సాధించారు. ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) వారికి అండగా నిలబడింది.

గిగ్ వర్కర్స్‌కు భద్రత కరువు

జొమాటో, స్విగ్గీ, ఫ్లిప్‌కాట్, ర్యాపిడో, ఓలా, ఊబర్ సంస్థల్లో పని చేస్తున్న గిగ్ వర్కర్లకు కనీస రక్షణ ఉండడం లేదు. విశాఖ వంటి నగరాల్లో వీరిపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయి. వీటిని ఆయా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. 'బ్రో' అన్నందుకు తమ సిబ్బందిపై దాడి జరిగినా స్విగ్గీ మేనేజర్ సైతం పట్టించుకోలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిరుద్యోగం, కుటుంబాలను ఎలాగైనా పోషించుకోవాలన్న కారణంతో చదువుకున్న యువత భద్రత లేని ఇటువంటి సంస్థల్లో పనిచేయడం తప్పనిసరిగా మారింది. వారిని ఎప్పుడు తీసేస్తారో కూడా తెలియని పరిస్థితి. రోజంతా పనిచేసినా కనీసం రూ.500 కూడా రావడం లేదని డెలివరీ బాయ్స్ వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు రక్షణ కల్పించాలని, ఉద్యోగ భద్రత, కనీస ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- భవన నిర్మాణ కార్మికుల ధర్నాలో సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన విజయవాడలోని ధర్నా చౌక్‌లో శుక్రవారం ధర్నా జరిగింది. ఈ కార్యక్రమానికి నర్సింగరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సిపిఎం చొరవతో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టం ద్వారా అన్ని రాష్ట్రాల్లో భవన నిర్మాణ సంక్షేమ బోర్డులు ఏర్పాటయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో కూడా 2007లో బోర్డు ఏర్పాటైందని, దీని ద్వారా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలయ్యాయని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఈ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను నిలిపివేసిందని విమర్శించారు. బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మికులు పెద్దయెత్తున ఆందోళన చేశారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఈ ఆందోళనలకు మద్దతు తెలిపిన టిడిపి నాయకులు అధికారంలోకి రాగానే బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపరిచారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు కావొస్తున్నా ఇప్పటికీ బోర్డు ఏర్పాటుపై ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం సంక్షేమ బోర్డును ప్రారంభించేందుకు చర్యలు ప్రారంభించకపోతే కార్మికులు ఆందోళన పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారావు, ఆర్‌వి నర్సింహారావు, కోశాధికారి కెవి గోపాలరావు, నాయకులు గోపాల్ తదితరులు

17ఏళ్ల తర్వాత

చెపాక్‌లో బెంగళూరు గెలుపు

- పాటిదార్ కెప్టెన్ ఇన్నింగ్స్
- హేజిల్‌వుడ్‌కు మూడు వికెట్లు
- 50 పరుగుల తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్ ఓటమి

పటీధర్ (51పరుగులు)

చెన్నై: చెపాక్ స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 17ఏళ్ల తర్వాత విజయాన్ని నమోదు చేసింది. మే 21, 2008లో చెన్నైపై 14 పరుగులు తేడాతో నెగ్గిన బెంగళూరు జట్టు.. మళ్లీ 1655రోజుల తర్వాత 50 పరుగుల తేడాతో అదే మైదానంలో.. అదే జట్టుపై విజయం నమోదు చేసుకొంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 196పరుగుల భారీ స్కోర్ నమోదు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చెన్నై జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి ఎనిమిది వికెట్లు కోల్పోయి 146 పరుగులే చేయగల్గింది. చెన్నై జట్టులో రచిన్ రవీంద్ర(41), జడేజా(25), ధోనీ(30నాటౌట్) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. బెంగళూరు బౌలర్లు హేజిల్‌వుడ్‌కు మూడు, యశ్ దయాల్, లివింగ్‌స్టోన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

అంతకుముందు రాయల్ ఛాలెంజర్స్ కెప్టెన్ రజత్ పాటిదార్(51) సూపర్ అర్ధసెంచరీకి తోడు కోహ్లి, పడిక్కల్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) జట్టు భారీస్కోర్‌ను నమోదు చేసింది. చెపాక్ వేదికగా చెన్నై సూపర్‌కింగ్స్‌తో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 196పరుగులు చేసింది. టర్నింగ్ పిచ్ మీద ఇది కొండంత లక్ష్యమే. టాస్ గెలిచిన రుతురాజ్ గైక్వాడ్ బెంగళూరును బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. తొలి మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై చెలరేగిన ఓపెనర్ ఫిలిప్ సాల్ట్(32), చెపాక్‌లోనూ చితక్కొట్టాడు. విరాట్ కోహ్లి(16)తో కలిసి జట్టుకు శుభారంభం ఇచ్చాడు. విరాట్ తడబడినా సాల్ట్ తన విధ్వంసంతో ఆర్సీబీ స్కోర్ బోర్డు పరుగులు పెట్టింది. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని నూర్ అహ్మద్ విడదీశాడు. ఫ్రంట్‌ఫుట్ వచ్చిన సాల్ట్‌ను ధోనీ మెరుపు వేగంతో స్టంపింగ్ చేశాడు. దాంతో, 45 వద్ద ఆర్సీబీ మొదటి వికెట్ పడింది. అనంతరం కోహ్లి జతగా దేవ్‌దత్ పడిక్కల్(27) దూకుడు కొనసాగించాడు. రవీంద్ర జడేజా బౌలింగ్‌లో 4, 4, 6 బాదడంతో పవర్ ప్లేలో ఆర్సీబీ వికెట్ నష్టానికి 56 పరుగులు చేసింది. అయితే.. వేగంగా ఆడే క్రమంలో పడిక్కల్.. అశ్విన్ బౌలింగ్‌లో గైక్వాడ్ చేతికి దొరికిపోయాడు.

స్కోర్‌బోర్డు...

బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (స్టంప్)ధోనీ (బి)నూర్ అహ్మద్ 32, కోహ్లి (సి)రచిన్ రవీంద్ర (బి)నూర్ అహ్మద్ 31, దేవదత్ పడిక్కల్ (సి)గైక్వాడ్ (బి)అశ్విన్ 27, రజత్ పటీధర్ (సి)శామ్ కర్రన్ (బి)పథీరణ 51, లివింగ్‌స్టోన్ (బి)నూర్ అహ్మద్ 10, జితేశ్ శర్మ (సి)రచిన్ రవీంద్ర (బి)ఖలీల్ అహ్మద్ 12, టిమ్ డేవిడ్ (నాటౌట్) 22, కృనాల్ పాండ్యా (సి)హుడా (బి)పథీరణ 0, భువనేశ్వర్ కుమార్ (నాటౌట్) 0, అదనం 11. (20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 198పరుగులు. **వికెట్ల పతనం:** 1/45, 2/76, 3/117, 4/145, 5/172, 6/176, 7/177

బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 4-0-28-1, అశ్విన్ 2-0-22-1, శామ్ కర్రన్ 3-0-34-0, నూర్ అహ్మద్ 4-0-36-3, జడేజా 3-0-37-0, పథీరణ 4-0-36-2.

చెన్నై ఇన్నింగ్స్: రచిన్ రవీంద్ర (సి)యశ్ దయాల్ 41, త్రిపాఠి (సి)సాల్ట్ (బి)హేజిల్‌వుడ్ 5, గైక్వాడ్ (సి)మనోజ్ (బి)హేజిల్‌వుడ్ 0, దీపక్ హుడా (సి)జితేశ్ శర్మ (బి)భువనేశ్వర్ 4, సామ్ కర్రన్ (సి)కృనాల్ పాండ్యా (బి)లివింగ్‌స్టోన్ 8, శివమ్ దూబే (బి)యశ్ దయాల్ 19, జడేజా (సి)సాల్ట్ (బి)హేజిల్‌వుడ్ 25, అశ్విన్ (సి)సాల్ట్ (బి)లివింగ్‌స్టోన్ 11, ధోనీ (నాటౌట్) 30, నూర్ అహ్మద్ (నాటౌట్) 0, అదనం 3. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 146పరుగులు.

వికెట్ల పతనం: 1/8, 2/8, 3/26, 4/52, 5/75, 6/80, 7/99, 8/130

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 3-0-20-1, హేజిల్‌వుడ్ 4-0-21-3, యశ్ దయాల్ 3-0-18-2, లివింగ్‌స్టోన్ 4-0-28-2, సుయాశ్ శర్మ 4-0-32-0, కృనాల్ పాండ్యా 1-0-10-0

ఐపిఎల్‌లో నేడు

గుజరాత్ × ముంబయి
వేదిక: అహ్మదాబాద్; రాత్రి 7.30గం॥లకు

100మీ. పరుగులో గురిందేవిర్ సింగ్ జాతీయ రికార్డు బ్రద్దలు

బెంగళూరు: ఇండియా గ్రాండ్ ఫ్రిలో గురిందేవిర్ సింగ్ ఒక జాతీయ రికార్డును బ్రేక్ చేశాడు. శుక్రవారం జరిగిన 100మీ. పరుగు పందెంను 10.20 సెకన్లలో గమ్యానికి చేరి ఈ రికార్డును బ్రద్దలు కొట్టాడు. దీంతో 2011లో తన పేర ఉన్న 10.27సెకన్ల రికార్డు బ్రద్దలైంది. ఇక మణికంఠ 10.22సెకన్లుతో రెండోస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో 0.01సెకన్లలో జాతీయ రికార్డును బ్రద్దలు కొట్టలేకపోయాడు. సింగ్ 2021, 2024 ఇంటర్ స్టేడియ ఛాంపియన్‌షిప్‌లో 100మీ. పరుగులో స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నాడు. 2024 ఫెడరేషన్ కప్‌లోనూ గురిందేవిర్ బంగారు పతకంతో మెరిసాడు.

సెమీస్‌కు జకోవిచ్

మెన్సిక్, ఫ్రిట్జ్ కూడా.. మియామీ ఓపెన్ టెన్నిస్ టోర్నీ

న్యూయార్క్: మియామీ ఓపెన్ టెన్నిస్ టోర్నీ సెమీఫైనల్లోకి మాజీ టాప్‌సీడ్ ఆటగాడు, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. గురువారం రాత్రి జరిగిన క్వార్టర్‌ఫైనల్లో జకోవిచ్ 6-3, 7-6(7-4)తో అమెరికాకు చెందిన సెబాస్టియన్‌ను చిత్తుచేశాడు. ఈ మ్యాచ్ సుమారు గంటా 24నిమిషాలసేపు సాగింది. ఇతర క్వార్టర్‌ఫైనల్ పోటీల్లో మెన్సిక్, ఫ్రిట్జ్ ప్రత్యర్థులను చిత్తుచేసి సెమీస్‌కు చేరారు. శనివారం జరిగే సెమీస్‌లో జకోవిచ్.. బల్గేరియాకు చెందిన డిమిట్రోవ్‌తో తలపడనున్నాడు. ముఖాముఖి పోరులో జకోవిచ్ 12-1 ఆధిక్యతలో ఉన్నాడు. ఇక అన్‌సీడెడ్ 19ఏళ్ల మెన్సిక్ 7-6(7-5), 6-1తో 17వ సీడ్ ఆర్థర్ ఫైల్స్‌ను చిత్తుచేశాడు. మరో పోటీలో ఫ్రిట్జ్ 7-5, 6-7(7-9), 7-5తో బెర్రెట్టినిని ఓడించి సెమీస్‌కు చేరాడు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లోకి టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకా ప్రవేశించింది. సెమీస్‌లో సబలెంక 6-2, 6-2తో 6వ సీడ్ పోలిని(ఇటలీ)ని ఓడించింది. ఇక సంచలన విజయాలతో సెమీస్‌కు చేరిన చెక్ రిపబ్లిక్‌కు చెందిన 19ఏళ్ల అలెగ్జాండ్రా ఎలా జోరుకు బ్రేక్ పడింది. సెమీస్‌లో అలెగ్జాంఢ్రా 6-7(3-7), 7-5, 3-6తో అమెరికాకు చెందిన పెగూలా చేతిలో ఓటమిపాలైంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68